ఎత్తిపోతల పథకాలకు నిలిచిన నీటి సరఫరా



నెట్టెంపాడు నుంచి ఆగిపోయిన నీటి విడుదల

- జూరాల ప్రాజెక్టులో నీరు తగ్గిపోవడమే కారణం
- ప్రస్తుతం 2.556 టీఎంసీలు నిల్వ
- కుడి, ఎడమ కాలువలకు మాత్రమే విడుదల


వివరాలు 3లో..

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జోగుళాంబ గద్వాల

గురువారం 17, ఆగస్టు 2017, పేజీలు 20





పెంచికల్ పేట వద్ద గట్టు ఎత్తిపోతల కోసం పరిశీలించిన స్థలం

గట్టు ఎత్తిపోతల పథకంలో నిపుణులు సూచించిన మార్పులు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించనున్నాం. ప్రభుత్వం ఆమోదం లభించడంతో

పది రోజుల్లో నివేదికలు

డీపీఆర్, టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభిస్తాం. కొంత ఆలస్యం జరిగినా చివరకు రైతులకు ఐదు వేల ఎకరాల భూమి సాగు అదనంగా సాగులోకి వచ్చి లా భం చేకూరనుంది.



● ఖగేందర్, సీఈ, జూరాల

ఎక్కిన గట్టు

వార్త మధ్య పేజీల్లో

సముద్ర మట్టానికి నాలుగు వందల మీటర్ల ఎత్తులో ఉన్నది గట్టు మండలం. ఇక్కడి పొలాలకు సాగునీరు తీసుకురావడం ఇరిగేషన్x అధికారులకు ఓ సవాల్‌గా మారింది. వారి కృషి ఫలించబోతోంది. గట్టు ఎత్తిపోతల పథక నిర్మాణానికి త్వరలో మోక్షం లభించనుంది. 2005లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి గట్టు ఎత్తిపోతలకి అనుమతి ఇచ్చారు. రూ. 406 కోట్ల అంచనా వ్యయంతో నివేదికలు తయారుచేశారు. ఎమ్మెల్యే డీకే అరుణ ఒత్తిడి మేరకు నాడు ఈ పథకానికి మంజూరు లభించింది. అనంతరం జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ అధికారంలో వచ్చాక సీఎం కేసీఆర్ అసెంబ్లీలో గట్టు ఎత్తిపోతలను పూర్తి చేస్తామన్నారు. అప్పటి నుంచి పలుమార్లు డిజైన్x లో మార్పుతో కాలయాపన చేస్తూ వచ్చారు. ప్రస్తుతం సెంట్రల్ డిజైన్x ఆర్గనైజేషన్x (సీడీవో) బృందం తుదిరూపం ఇచ్చారు. దీనికి సంబంధించి నివేదిక తయారు చేశారు. ప్రస్తుత ప్రతిపాదనల్లో అంచనా వ్యయం తగ్గడంతో పాటు సాగు విస్తీర్ణం పెరగనుంది. కేటీదొడ్డి, గట్టు, ధరూర్ మండలాలకు సాగునీరు అందించనుండటంతో నడిగడ్డ కోనసీమగా మారునుంది.

- ఎత్తిపోతలకు త్వరలో మోక్షం
- కాలయాపనలకు ఫుల్‌స్టాప్
- పెంచికల్ పేట వద్ద రిజర్వాయర్
- పెరగనున్న సాగు విస్తీర్ణం
- తగ్గనున్న అంచనా వ్యయం
- రైతన్నకు తీపి కబురు
- పది రోజుల్లో ప్రభుత్వానికి నివేదికలు
- సస్యశ్యామలం కానున్న కేటీదొడ్డి, ధరూర్, గట్టు మండలాలు
- అదనపు జలాలు నెట్టెంపాడు నుంచి గట్టుకు తరలింపు
- సోలార్ ప్లాంట్ రద్దు కావడంతో కలిసొచ్చిన ఐదు వేల ఎకరాలు
- కోనసీమగా మారనున్న నడిగడ్డ ప్రాంతం



గట్టు ఎత్తిపోతల పథకం మ్యాప్

భక్తిశ్రద్ధలతో పెద్దకిస్తీ



7లో

సర్కారు అండాలను తీసుకువస్తున్న భక్తులు

ప్రాణాంతక వ్యాధులను తరిమేదాం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రజత్ కుమార్ షైనీ

3లో

- కలెక్టర్ రజత్ కుమార్ షైనీ
- ఎంఆర్ వ్యాక్సిన్x పై అవగాహన
- పట్టణంలోని కృష్ణవేణి చౌరస్తా నుంచి ర్యాలీ
- వ్యాక్సిన్x వేసేందుకు ఏఎన్x ఎంలకు శిక్షణ
- డీఎంఅండ్‌హెచ్x వో మల్లికార్జునప్ప

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఎంఆర్ వ్యాక్సిన్‌కు
అందరూ సహకరించాలి

● నాగరాజుశెట్టి,
జిల్లా ఆరోగ్య బోధకుడు



గద్వాలటౌన్: ప్రాణాంతకమైన మీజుల్స్ రూబెల్లా వ్యాధిని పూర్తిగా తరిమికొట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి అందరూ సహకరించాలని జిల్లా ఆరోగ్య బోధకుడు నాగరాజు శెట్టి అన్నారు. గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభిస్తున్న నేపథ్యంలో బుధవారం ఆంధ్రజ్యోతి ఆయనతో ముఖాముఖి సంభాషించింది.

ఎంఆర్ వ్యాక్సినేషన్‌కు అర్హులెవరు ? ఎంతమందిని గుర్తించారు ?

9నెలలనుంచి 15 ఏళ్ల లోపు వయసున్న వారు ఎంఆర్ వ్యాక్సిన్ పొందేందుకు అర్హులు జిల్లాలో వీరి సంఖ్య 1,80,986మందిని గుర్తించాం.

వ్యాక్సిన్ల పంపిణీకి ఏర్పాట్లు ఎలా చేశారు.

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులను పంపిణీ చేశాం. ఇప్పటికే వాక్సినేషన్ పై జిల్లా వ్యాప్తంగా విస్తృతప్రచారం చేపట్టాం.

వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి ? పర్యావసానం ఏమిటి?

తట్టు గురించి అందరికి తెలిసిందే. మీజిల్స్ ప్రాణాంతక వ్యాధి శరీరంపై దద్దుర్లు రావటం జరుగుతుంది. రూబెల్లా దాదాపు ఇవే లక్షణాలు ఉంటాయి. ఇది గర్భిణులకు సోకితే ప్రమాదం. దీని వల్ల గర్భస్రావం అయ్యే అవకాశం ఉంటుంది. ఒక వేళ కాన్పు అయినా పట్టే పిల్లలు అవయవలోపం, గుండె, మెదడు సంబంధ వ్యాధులతో జన్మిస్తారు. రూబెల్లాను దద్దుర్ల జ్వరం, జర్మన్‌మీజుల్స్ అని పిలుస్తారు.

తట్టు వల్ల జిల్లాలో ఏమైనా మరణాలు సంభవించాయా ?

దీనిపై నిర్ధిష్టంగా చెప్పలేము. తట్టు వ్యాధి రూపం దాల్చితే నిమ్మోనియయా, డయేరియా వచ్చే అవకాశం ఉంటుంది. దీని వల్ల చనిపోయిన సంఘటనలు ఉన్నా.. వాటిని తట్టువల్లే జరిగిన మరణాలుగా గుర్తించలేరు.

ఎంఆర్ వ్యాక్సిన్ వల్ల ఏమైనా సైడ్‌ఎఫెక్ట్‌లు ఉన్నాయా ?

మీజుల్స్, రుబెల్లా వ్యాక్సిన్ పూర్తిగా సురక్షితమైంది. ఎవరికి ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ గానీ, ఇతర ఆరోగ్య పరమైన ఇబ్బందులు గానీ ఉండవు.

చావిడి ఆంజనేయుడి ఆలయం
సకల దేవతల నిలయం


సకల దేవతలు కొలువైన ఆలయం ఇదే..


వ్యాసరాయలు చేత ప్రతిష్ఠ అయిన ఆంజనేయ స్వామి మూలవిరాట్

- గద్వాల పట్టణంలో 500 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం
- వ్యాసరాయుల చేత ప్రతిష్ఠ అయిన హనుమాన్ మూలవిరాట్
- పాండురంగ విగ్రహం ఏర్పాటుతో కృష్ణమందిరంగా పేరు
- ఆరు తరాలుగా ఒకే కుటుంబం అర్చకత్వం


శ్రీకృష్ణుడి మూలవిరాట్


సూర్యనారాయణుడు


విఠల్ రుక్మిణీ విగ్రహాలు


నందీశ్వర సమేత శివాలయం

గద్వాలటౌన్: పట్టణంలో పురాతన ఆలయాలుగా ప్రసిద్ధి గాంచిన వాటిలో చావిడి ఆంజనేయ స్వామి ఆలయం ఒకటి. ఈ ఆలయానికి ప్రత్యేక చరిత్ర ఉంది. 500 ఏళ్ల క్రితం వ్యాసరాయులు కృష్ణానది తీర ప్రాంతంలో సంచరించారని, ఈ క్రమంలో నదీతీరంలో గల ధరూర్ మండలం చింతరేవుల వద్ద, ఇటిక్యాల మండలం బీచుపల్లి వద్ద ఆంజనేయుడి విగ్రహాలకు ప్రతిష్ఠించారని, అదే సమయంలో వాటితో పాటు గద్వాలలో కూడా ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారని ప్రతీతి. సంస్థానధీశుల కాలంలో ఈ ఆలయానికి సమీపంలో రెవెన్యూ (భూపరిపాలన)కు సంబంధించి చావిడి (కార్యాలయం) ఉండేదని, అందుకే దీనికి చావిడి ఆంజనేయస్వామి ఆఆలయం అన్న పేరు వచ్చిందని ఆలయ పూజారి కాశీరాఘవేంద్ర చర్య వివరించారు. ఈ ఆలయ ప్రాంగణంలో చాలా దేవతామూర్తుల విగ్రహాలు ప్రతిష్ఠ అయి నిత్య పూజలందుకుంటున్నాయి.

కృష్ణమందిరంగా పేరు

చావిడి ఆంజనేయస్వామి ఆలయంలో నిత్య పూజలతో పాటు భజనలు చేయడం ఆనవాయితీగా ఉండేది. స్థానికంగా ఉండే భక్తులు కొందరు పండరీపురం భక్తులు కాగా, వారి అభీష్టం మేరకు పాండురంగ విఠలుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆ విగ్రహం ఆలమందలోని ఆవు ముందు నిల్చుని పిల్లన గ్రోవి వాయిస్తున్న వేణుగోపాలుడి రూపంలో ఉండగా ఈ ఆలయాన్ని శ్రీకృష్ణమందిరంగా పిలవడం ప్రారంభించారు. దీంతో ఆలయానికి అదే పేరు ఖాయంగా మారింది.

శివలింగం ప్రతిష్ఠ

శైవుల కోరిక మేరకు కృష్ణదేవరాయలు అప్పట్లో అనేక గ్రామాల్లో శివాలయాలు నిర్మించారని ప్రతీతి. ఈ క్రమంలోనే ఇక్కడ కూడా శివలింగాన్ని ప్రతిష్ఠించి ఎదురుగా నందీశ్వరున్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ నిత్య పూజలు, అభిషేకాలు నిర్విఘ్నంగా కొనసాగుతుంటాయి.

సూర్యనారాయణ విగ్రహం

ఆలయ ప్రాంగణంలో సూర్యనారాయణుడు స్వయంభువుగా వెలిశాడని ఆలయ వంశపారంపర్య పూజారులు వివరించారు. ఒక గుండుపై స్వయంభు వుగా ఉన్న స్వామిని భక్తులు సరిగ్గా గుర్తించలేకపోతున్న కారణంగా వందేళ్ల క్రి తం అప్పటి ఆలయ నిర్వాహకులు విగ్రహ రూపంలో అమర్చినట్లు తెలిపారు. ఐదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ దేవి ఆలయం వద్ద తప్ప నడిగడ్డలో ఎక్కడా కూడా సూర్యనారాయణ విగ్రహాలు లేకపోవడం విశేషం. ప్రతి ఏటా చైత్ర శుద్ధ సప్తమి నాడు వచ్చే రథ సప్తమిని ఇక్కడ సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తారు.

భూదేవి సమేత వెంకటేశ్వరుడు

ఈ ఆలయంలోనే ఒక వైపు లక్ష్మీదేవి, మరోవైపు పద్మావతి దేవీలతో మధ్యన వెంకటేశ్వరుని విగ్రహం ప్రతిష్ఠించారు. నిత్యపూజలు, ప్రత్యేక అర్చనలతో శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వరుని దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు.

నవగ్రహాలు, నాగదేవతలు

శివుడు, వేంకటేశ్వరుడు, రుక్మిణిపాండురంగడు, సూర్యనారాయణుడు కొలువైన ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుండడం వల్ల ఇక్కడ నవగ్రహమూర్తులను ప్రతిష్ఠించారు. వాటితో పాటు నాగులచవితి సందర్భంగా మహిళలు పూజలు చేసుకోవడం కోసం నాగుల విగ్రహాలు ఏర్పాటుచేశారు.

వంశపారంపర్య అర్చకులు

ఆలయం ఏర్పడిన మొదటి నుంచి ఇప్పటి వరకు ఒకే వంశానికి చెందిన ఆరుతరాల వారు ప్రధాన అర్చకులుగా ఉండటం విశేషం. గద్వాల సంస్థానాధీశుడు నలసోమనాద్రి భూపాలుడు తన ఆ స్థానంలోని వైష్ణవ మతానికి చెందిన ఆస్థాన పండితుడు కాశీ శేషాచార్యులను మొట్ట మొదట అర్చకుడిగా నియమించారు. ఆయన అనంతరం కుమారుడు కాశీసుబ్బచార్యులు, తరువాత కాశీ శ్రీని వాసాచా ర్యులు, అనంతరం కాశీబాబాచార్యులు ప్రధాన అర్చకులుగా సేవ లందిం చారు. కాశీబాబాచార్యులు కాలం చెందిన పిదప ఆయన కుమా రులు కాశీరాఘవేంద్రాచార్యులు, కాశీ శ్రీనివాసాచార్యులు ప్రస్తుతం పూజలు ఆచరి స్తున్నారు.

ఏడాదిలో నాగులు సార్లు ప్రత్యేక పూజలు

సకల దేవతానిలయంగా ఉన్న ఈ మందిరంలో ఆలయ అర్చకులు కాశీరాఘవేంద్రచార్యులు ఏడాదికి నాలుగు సార్లు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మహాశివరాత్రి నాడు శివాలయంలో మహారుద్రాభిషేకం, ఆషాఢ మాసంలో పాండురంగస్వామి కల్యాణోత్సవం, చైత్రశుద్ధి పౌర్ణమి నాడు హనుమాన్ జయంతి, మార్గశిర శుద్ధ త్రయోదశినాడు హనుమాన్ వత్రాన్ని శాస్త్రోక్తంగా జరుపుతారు. భక్తులు నిత్యం వచ్చి ఆయా దేవతామూర్తులను దర్శించుకుని పూజలు నిర్వహిస్తుంటారు.

ఆధ్యాత్మికం

భక్తసులబుడు అడివేశ్వరుడు

గద్వాలటౌన్ : పట్టణంలోని వేదనగర్‌లో కొండపల్లిరాజయ్యతోట పక్కన వెలసిన అడవేశ్వరస్వామి ఆలయం పురాతన ఆలయాల్లో ఒకటిగా పేరుగాంచింది. గతంలో పట్టణం వెలుపల పంటపొలాల మధ్య ఉన్న ఆలయానికి సమీపంలోని కుటుంబాల వారే వెళ్లేవారు. దీంతో ఆలయం శిథిలం కాగా ఇటీవల ఆలయం దాత సహకారంతో పుననిర్మాణంతో పాటు మూలవిరాట్‌ను కూడా పునః ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి గత రెండు సంవత్సరాలుగా ఆలయంలో నిత్యపూజలు నిర్వహించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలలో ఆంజనేయ స్వామి విగ్రహం, నాగదేవతల ప్రతిమలు ఏర్పాటు చేయడంతో పాటు రాగివేపచెట్లు కలయికగా అశ్వతనారాయణ వృక్షం, ఉసిరిచెట్టు, బిల్వ వృక్షాలు ఉండటం వలన భక్తుల సందర్శన పెరిగింది. ఆలయంలో నిత్యపూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తున్నట్లు అర్చకుడు నాగరాజు తెలిపారు. ప్రతి అమావాస్య రోజు అన్నదానం నిర్వహిస్తామన్నారు.


పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు నాగరాజు

ఉద్యోగాల భర్తీపై తక్షణం దృష్టి సారించాలి

● వెంకట్రాజా రెడ్డి, టీఎన్‌జీఓ జిల్లా ప్రధాన కార్యదర్శి



లీడర్ వాయిస్

గద్వాలటౌన్: లక్ష ఉద్యోగాల భర్తీ ప్రకటనలకే పరిమితం చేయకుండా ఆచరణలో ఉంచేందుకు ప్రభుత్వం తక్షణం దృష్టి సారించాలని టీఎన్ జీఓ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రాజా రెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల ప్రభుత్వం సర్వీసు కమిషన్ ద్వారా విడుదల చేస్తున్న పలు నోటిఫికేషన్లు , వివాదాస్పదం కావడమే గాక లెక్చరర్ల క్రమబద్ధీకరణ జీఓ కూడా న్యాయస్థానం ముందు నిల్వకపోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా గమనించాలని, పాలన సౌలభ్యం పేరుతో 10నుంచి 31జిల్లాలకు పెంచిన ప్రభుత్వం ఆ స్థాయిలో ఉద్యోగుల సంఖ్యను పెంచకపోవడం సమస్యగా మారిందని, దీంతో అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీలసంఖ్య పెరిగిపోయిందని, ముగ్గురు చేయాల్సిన పనిని ఒక్కరు చేస్తుండడం వల్ల పనుల్లో గందరగోళమేకాక ఉ ద్యోగులపై ఒత్తిడి పెరిగిందని తెలిపారు. కనుక ప్రభుత్వం వీటిని గుర్తించి ఉద్యోగా లను భర్తీ చేయాలని చెప్పారు. కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులకు 20శాతం హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాల్సి ఉండగా కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రాల్లో ఇప్పటికి 14.5శాతం మాత్రమే హెచ్‌ఆర్‌ఏ ఇస్తున్నారన్నారు. దీనిపై ముఖ్యమంత్రి తక్షణం దృష్టి సారించాలని ఆయన కోరారు.

విజ్ఞానంతో కూడిన విద్యనందించాలి

- జిల్లా ఇంటర్మీడియట్ అధికారి తిమ్మయ్య
- పలు కళాశాలల ఆకస్మిక తనిఖీ

అయిజ: విద్యార్థులకు విజ్ఞానంతో కూడిన విద్యను అందించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి తిమ్మయ్య పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శివయ్య ఆకస్మికంగా తనఖీచేశారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. సమయపాలన పాటించాలని, లేనిచో తగు చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గద్వాల జోగుళాంబ జిల్లా 24వ స్థానం లో ఉందన్నారు. దీనిని 5వ స్థానంలో తీసుకురావటానికి కృషిచేయాల్సి ఉందని అధ్యాపకులకు, ప్రిన్స్‌పాల్‌లకు సూచించారు. అధ్యాపకుల, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. కళాశాలలోని నాన్‌సెక్షన్ పోస్టులను సెక్షన్ పోస్టులుగా మార్చాలని అధ్యాపకులు జిల్లా అధికారిని కోరారు. పర్నీచర్, వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఇంచార్జి ప్రిన్స్‌పాల్ రాజేందర్, కృష్ణవర్దన్ ఉన్నారు.


అయిజ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపాధ్యాయ బృందంతో జిల్లా ఇంటర్ విద్యాధికారి వావిలాల తిమ్మయ్య

విద్యార్థులు పోటీ పరీక్షలకు..

గట్టు: విద్యార్థులు చదువుకుంటూనే పోటీపరీక్షలకు సైతం సిద్ధం కావాలని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి తిమ్మయ్య సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన అకస్మికంగా తనిఖీచేశారు. కళాశాలలోని తరగతి గదిలోకి వెళ్లి ప్రశ్నలు వేసి వారి ద్వారా జవాబులు రాబట్టారు. అనంతరం విద్యార్థులకు హాజరు, బోధకుల వివరాలు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. విద్యార్థులకు ఇంటర్ దశ కీలకమైనదని నిర్లక్ష్యండా ఉండొదన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఎంపిసి, బైపిసి గ్రూపులతో పాటు వృత్తి విద్యా కోర్సు అయిన ఎంఎల్‌టి గ్రూపులు వచ్చే విధంగా కృషి చేస్తానని హామి ఇచ్చారు. విద్యార్థులు చెప్పిన జవాబులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్‌రెడ్డితో పాటు అధ్యాపకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కళాశాలలో సిబ్బందితో మాట్లాడుతున్న తిమ్మయ్య

ధరూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా ఇంటర్ విద్యాధికారి వావిలాల తిమ్మయ్య అకస్మిక తనిఖీచేశారు. ప్రార్థన సమయంకంటే ముందుగానే కళాశాలకు చేరుకుని ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిగత వికాసాన్ని పెంపొందించుకుని జీవితంలో ఉన్నతమైన స్థానాలు చేరేందుకు విద్యార్థులకు నైపుణ్య వికాస విలువలను వివరించారు. అనంతరం కళాశాలలోని ప్రిన్సిపాల్, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల సంఖ్యను పెంచి కళాశాలకు విద్యార్థులను క్రమంతప్పకుండా హాజరయ్యేటట్లు చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే కళాశాలలోని ఉత్తీర్ణత శాతాన్ని వంద శాతం వరకు పెంచాలని దానికి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కళాశాల ముందుభాగంలోని కందకాన్ని పూడ్చివేయాలని విద్యాధికారికి విద్యార్థులు వినతిపత్రం సమర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధులను తరిమేద్దాం

- కలెక్టర్ రజతX కుమార్ షైనీ
- ఎంఆర్ వ్యాక్సినX పై అవగాహన

గద్వాలటౌన్: చిన్నారులు, గర్భిణుల పాలిట మహమ్మారిలా ఉన్న ప్రాణాంతక వ్యాధులను తరిమేద్దామని కలెక్టర్ రజతX కుమార్ షైనీ పిలుపుని చ్చారు. జిల్లాలో గురువారం నుంచి చేపట్టనున్న ఎంఆర్ వ్యాక్సినేషనX కార్యక్రమానికి సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని చేపట్టారు. స్థానిక కృష్ణవేణి చౌరస్తా వద్ద కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. 2020నాటికి తట్టు వ్యాధిని సమూలంగా తుడిచి పెట్టడమేగాక రుబెల్లాని పూర్తిగా అదుపులో ఉంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వ్యాక్సినేషనX కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడిన డీఎంఅండ్‌హెచX వో మల్లికార్జునప్ప జిల్లాలో మొత్తం 180986మందికి ఎంఆర్ వ్యాక్సినX ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 156మంది ఏఎనX ఎంలకు శిక్షణనిచ్చామన్నారు. తొలివిడతగా తప్పిపోయిన వారికి నెలఖారులోగా వ్యాక్సినX అందజేస్తామన్నారు. డీఈవో వేణుగోపాల్, డీడబ్ల్యూవో అరుణ, డీపీఆర్‌వో సీతారాం, సీడీపీవో జ్ఞానకుమారి, గద్వాల ఎంఈవో ప్రతాప్‌రెడ్డి, తహసీల్దార్ రాజు, వైద్యాధికారులు రాధిక, ఉజ్మా బేగం, సునీత, డీపీఎX వో కాంత, సీహెచX వో రామకృష్ణ, నరేంద్రబాబు, నాగరాజుశెట్టి, ఏఎనX ఎంల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుకపై నిషేధం ఎత్తివేయాలి

- కలెక్టర్‌కు సీఐటీయూ నాయకుల వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

గద్వాలఅర్బన్: జిల్లాలో నిర్మాణం రంగం కార్మికుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఇసుకపై నిషేధం ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు కోటేష్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో భవననిర్మాణ కార్మికులు సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ రజతX కుమార్ షైనీకి వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో ఇసుకపై నిషేధం విధించడంతో నిర్మాణాలన్నీ పూర్తిగా నిలిచిపోయాయన్నారు. దీంతో ఈరంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుకమాఫియాను అరికట్టి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జయన్న, వీరన్న, సత్యం, మంజు, పరుశరాం, నర్సింహులు, కృష్ణ, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలకు నిలిచిన నీటి సరఫరా

ఆంధ్రజ్యోతి, గద్వాల: జూరాల ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలకు నీటిని నిలిపి వేశారు. జూరాల చీఫ్ ఇంజనీర్ ఆదేశాల మేరకు నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా-1, 2ఎత్తిపోతలకు నీటిని నిలిపివేస్తున్నట్లు ఇరిగేషనX అధికారులు తెలి పారు. జులై నెల 27నుంచి నీటి విడుదలకు ఇరిగేషనX అధికారులు నిర్ణయం తీసుకున్నారు. తొలుతగా కుడి, ఎడమ కాలువలకు నీటి విడుదల అనంతరం నెట్టెంపాడుకు ఒక పంపు ద్వారా 750, కోయిల్‌సాగర్‌కు 315, భీమా-1, 2కు 650, సమాంతర కాలువకు 650 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తు వచ్చారు. ప్రాజెక్టులో నీరు తగ్గిపోవడం వల్ల ఇరిగేషనX అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. జూరాల ప్రాజెక్టుకు కేవలం 2వేల క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. ఔట్‌ఫ్లో మాత్రం 4700 పైబడి విడుదల చేస్తుండడంతో ప్రాజెక్టులో ప్రస్తుతం కేవలం 2.556 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. కుడి, ఎడమ కాలువల కింద సాగు చేసినటువంటి పంటలను రక్షించడంతో పాటు మంచినీటి అవసరాల కోసం ఈ నీటిని నిల్వ చేస్తున్నట్లు ఇరిగేషనX అధికారులు చెబుతున్నారు. కర్ణాటకలోని నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల జరిగితే కాని తిరిగి ఎత్తిపోతలకు నీటిని విడుదల చేసే అవకాశం లేదు. లేదా భారీగా వర్షాలు కురిసిన నీటిని విడుదల చేస్తారు. ప్రస్తుతానికైతే ఎత్తిపోతలకు నీటిని నిలిపివేసినట్లు ఇరిగేషనX ఈఈ శ్రీధర్ తెలిపారు.

ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ తప్పనిసరి

- కలెక్టర్ రజత్‌కుమార్ షైనీ

ఆంధ్రజ్యోతి, గద్వాల: హరిత హారంలో భాగంగా నాటిన ప్రతిమొక్కను జియో ట్యాగింగ్ చేసి ఎఫ్‌టీవో, మస్టర్‌రోల్ పూర్తిచేయాలని కలెక్టర్ రజత్‌కుమార్ షైనీ ఎంపీడీవోలకు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో హరితహారంపై ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు మొక్కలు నాటే కార్యక్రమంలో మంచి పురోగతి సాధించడం జరిగిందని, కానీ పూర్తిచేసిన పనికి మస్టర్‌రోల్ జనరేట్ చేసి ఎఫ్‌టీఓ పూర్తి చేస్తేనే ఆన్‌లైన్ రికార్డు తయారవుతుందన్నారు. శనివారం వరకు ప్రతి ఎంపీడీఓ రూ.1.5లక్షల మస్టర్‌రోల్ టార్గెట్‌ను పూర్తి చేసేటట్లు చూడాలన్నారు. వచ్చే సమీక్ష సమావేశంలో ఆన్‌లైన్‌లో ఉన్నటువంటి రిపోర్టును మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని ఎంపీడీఓలు తీసుకువచ్చిన రిపోర్టులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అందువల్ల ఎంపీడీఓలందరూ నాటిన మొక్కలను మస్టర్ రోల్‌పూర్తి అయ్యేటట్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు గద్వాల జిల్లాలో సుమారు 44లక్షల మొక్కలను నాటడం జరిగిందని, ఇది మంచి ప్రగతిగా చెప్పుకోవాలన్నారు. జేసీ ఎస్. సంగీత, డీఆర్ఓ వేణుగోపాల్, డీఎఫ్ఓ ప్రకాష్, అధికారులు పాల్గొన్నారు.

21న మండల స్థాయి వ్యాసరచన పోటీలు

మల్దకల్: నడిగడ్డ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 21న ఎల్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారని ఎన్‌టీఎస్ఎఫ్ అధ్యక్షుడు పాల్వాయి లక్ష్మీనారాయణ ప్రధాన కార్యదర్శి ప్రతాప్, రఘు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు హాజరయ్యేలా ప్రధానో పాధ్యాయులు చొరవ తీసుకోవాలని వారు కోరారు. గెలుపొందిన వారికి జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తారని వారు తెలిపారు.

క్రిష్ణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మల్దకల్: సద్దలోనిపల్లిలో క్రిష్ణస్వామి బ్రహోత్సవాలలో భాగంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం బలిహరణం నిర్వహించారు. అనంతరం పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి 12 గంటలకు స్వామివారి రథోత్సవం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఈవో పురంధరకుమార్ తెలిపారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఆయన తెలిపారు.

పాఠశాలకు నీటి ట్యాంకు వితరణ



నీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ప్రత్యేకాధికారి క్రిష్ణయ్య

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యాకమిటీ వైస్‌చైర్మన్ సిద్ధ నర్సింహులు తన స్వంత డబ్బు రూ. 5వేలను వెచ్చించి తాగు నీటికోసం ట్యాంకును నిర్మించారు. దీన్ని బుధవారం మండల ప్రత్యేకాధికారి క్రిష ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి స్వామి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివన్న, ఉపాధ్యాయులు హరిబాబు గ్రామపంచాయితీ సర్పంచ్ దామనాగరాజు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రుబెల్లా నుంచి పిల్లలను కాపాడుకోవాలి

● మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బండ్లలక్ష్మీదేవి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ధరూర్: మిజిల్, రుబెల్లా వంటి ప్రాణాంతకమైన వ్యాధి నుంచి పిల్లలను రక్షించుకోవాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బండ్లలక్ష్మీదేవి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు, అంగన్ వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎం లకు రుబెల్లాపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ స్రవంతి మాట్లాడారు. రుబెల్లా, మిజిల్స్ వ్యాక్సీన్లు విడివిడిగా చేయించుకున్నప్పటికి ఇప్పుడు ఇచ్చే ఈ ఎంఆర్ వ్యాక్సిన్ లను 9 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల గల పిల్లలందరికి తప్పకుండా వేపించాలని ఆమె సూచించారు. ఇవి అన్ని పాఠశాలలు, కమ్యూనిటీ అంగన్ వాడీ, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఇస్తారని తెలిపారు. ప్రతి పాఠశాలలో ఉదయం 9గంటల నుంచి 2గంటల వరకు ఈ వ్యాక్సిన్ ను ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పద్మావెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో నర్సింహనాయుడు, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ విజయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'అంగన్ వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి'

కోయిలకొండ రూరల్ : మండలంలోని అంగన్ వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న కార్యకర్తల పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. అభంగపట్నం, వింజమూర్‌లలో రెండు చొప్పున, గార్లపాడు, చందాపూర్ తండా, ఉబ్బరితండాలలో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. మినీ అంగన్ వాడీ కేంద్రాలైన అయ్యవారిపల్లి, బాల్యానాయక్, వరదమాన, ఆచార్యపూర్, ముద్రోనితండాల్లోనూ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

బిందు సేద్యంతో లాభాలు



తాటికుంట శివారులో డ్రిప్పుతో సాగవుతున్న మునగ తోట

మల్దకల్: మండలంలోని పలువురు రైతులు బిందు సేద్యంలో పంటలను సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. 10సంవత్సరాలుగా మండలంలో వర్షాభావ పరిస్థితులు తలెత్తడంతో పండ్లతోటల పెంపకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. గతంలో 3నుంచి 4వేల హెక్టార్లలో సాగయ్యే తోటలు ప్రస్తుతం వందల ఎకరాలలోకి వచ్చాయి. ద్రాక్షా, దానిమ్మ, బొప్పాయి లాంటి తోటలు పూర్తిగా కనుమరుగయ్యాయి.

ఊపందుకున్న బిందు సేద్యం....

ప్రస్తుతం మండలంలో బిందు పరికరాల ద్వారా సేద్యం ఊపందుకుంది. తక్కువ నీటితో ఎక్కువ పంటను పండించడం రైతులు అలవాటు చేసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సీడీ చేయూతగా అందిపుచ్చుకుంటూ మామిడి బత్తాయి సపోటా, బొప్పాయి, నిమ్మ తోటలతో పాటు మునగతోటలను వాణిజ్య పంటలైన ప్రత్తి మిరప పంటలనూ రైతులు డ్రిప్పుతో సాగు చేస్తున్నారు. రైతులకు అధిక లాభాలను అందించే కూరగాయలైన టమాట వంకాయ దొండ కాకర బెండ చిక్కుడు లాంటి కూరగాయలతోపాటు పలురకాలైన ఆకుకూరలను కూడా బిందు సేద్యం ద్వారా తక్కువ నీటిని అందిస్తూ అధిక లాభాలు పొందుతుండడం ఇక్కడి రైతుల ప్రత్యేకత.

ఇక్కడి భూములు తోటలకు అనుకూలం..

తోటలకు అనుకూలమైన వ్యవసాయ భూములు అధికంగా ఉండడంతో ఇక్కడి రైతులు పండ్ల తోటలతో పాటు మునగ తోటల పెంపకానికి ఎక్కువ ప్రాముఖ్యతనిస్తున్నారు. మండల పరిధిలోని శేషంపల్లి గ్రామ రైతులు మునగతోటల పెంపకంలో జిల్లాలోనే అగ్రభాగాన నిలిచారు. ఇక్కడి రైతులు పీకేయం రకం మునగను సాగుచేస్తూ అధిక దిగుబడులతో పాటు అధిక లాభాలను గడించడం విశేషం. ఇక్కడి రైతులు డ్రిప్పు ద్వారా 50శాతం పంటలు పండించడం గమనార్హం.

డ్రిప్పుతో సాగు ఎంతో మేలు



సాగునీరు ఇబ్బందిగా మారిన పరిస్థితులలో డ్రిప్పు ద్వారా ఉన్న నీటితోనే చిక్కుడు బెండ తోటలను సాగుచేస్తున్నాను.ప్రస్తుతం తోట నిండుగా కళకళలాడుతూ ఉంది. నీరులేని పరిస్థితులలో బిందుసేద్యం లాభదాయకంగా ఉంది.

- రామాంజనేయులు రైతు మల్దకల్

సబ్సీడీపై డ్రిప్పును అందించాలి



డ్రిప్పుపై ఆధారపడిన రైతులకు ప్రభుత్వం సబ్సీడీపై పరికరాలు అందించాలి. డ్రిప్పును ఎలా ఉపయోగించుకోవాలో సంబంధిత శాఖాధికారులు రైతులను చైతన్యం చేస్తే మరింత మేలు చేకూరుతుంది.

- రఘు యువజన సంఘం నాయకులు బిజ్వారం

ఇంటర్వ్యూ

మండల అభివృద్ధికి కృషి

● భాస్కర్ జడ్పీటీసీ సభ్యుడు



మల్దకల్: మల్దకల్ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని మల్దకల్ జడ్పీటీసీ సభ్యుడు ఎల్కూరు భాస్కర్ ఆంధ్రజ్యోతికిచ్చిన ఇంటర్వూలో పేర్కొన్నారు.

మండల అభివృద్ధికి మీ నిధులు ఎంత ఖర్చు చేశారు

మూడున్నర సంవత్సరాలలో రూ. 70 లక్షలు రహదారుల నిర్మాణాలకు కేటాయించాం. వీటిలో రూ. 30లక్షల వివిధ గ్రామాలలో మట్టిరోడ్ల నిర్మాణాలకు, రూ. 40 లక్షల సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు ఖర్చు చేశాము.

తాగునీటి సమస్యలు తీర్చారా?

మండల పరిధిలోని మద్దెలబండ గ్రామానికి రూ. 10 లక్షలు, పాలవాయికి రూ. 5 లక్షలు విఠలాపురానికి రూ. 5లక్షలు తాగునీటి కోసం జడ్పీ నిధుల నుంచి ఖర్చు చేశాము. గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది ఉంటే మరిన్ని నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నాం.

మండలాభివృద్ధికి ఎలాంటి ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు?

ఎల్కూరు, విఠలాపురం పాఠశాలలో ప్రహరీ నిర్మాణం, ఆడివిరావల్ చెర్వు మల్దకల్, మద్దెలబండలో కమ్యూనిటీ హాల్ పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి మరో రూ. 70 లక్షల నిధులు కావాని నివేదిక పంపాం. నిధులు రాగానే అభివృద్ధి పనులు చేపడుతాం.

మండలంలో జరుగుతున్న హరితహారంలో కృషి ఏంటి?

మల్దకల్ మండలంలో హరితహారం శరవేగంగా కొనసాగుతుంది. ప్రతి గ్రామానికి 40 వేల మొక్కలు నాటాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం. నాటిన మొక్కలను పశువులు తినకుండా ట్రీ గార్డులు డ్రిప్పు ఏర్పాటుకు ఉత్సాహవంతులైన పారిశ్రామికవేత్తలను కలుస్తూ సమాజ సేవలో పాలుపంచుకోవాలని ఆహ్వానిస్తున్నాం. హరితహారాన్ని మండలంలో విజయవంతం చేయడానికి కృషిచేస్తున్నాను.

గట్టు సమావేశం వాయిదా

గట్టు: మండల కేంద్రంలోని గట్టు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించాలనుకున్న గట్టు గ్రామపంచాయతీ సమావేశానికి వార్డు మెంబర్లు గైర్హాజరయ్యారు. బుధవారం గ్రామపంచయితీ సమావేశం నిర్వహిస్తున్నట్లు అందరూ వార్డు మెంబర్లకు సమాచారం ఇచ్చారని సర్పంచ్ సంతోషమ్మ తెలిపారు. కాని వార్డు మెంబర్లు మాత్రం సమావేశానికి గైర్హాజరయ్యారని అన్నారు. మొత్తం 13 మంది వార్డు సభ్యులు గట్టు గ్రామ పంచాయతీలో ఉన్నారు. వార్డు సభ్యుల కోసం పంచాయతీ కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసి సర్పంచు సంతోషమ్మ, ఉపసర్పంచు పద్మమ్మతో పాటు ఈవోపీఆర్‌డీ రాంమోహన్ , పంచాయతీ కార్యదర్శి శివశంకర్ కార్యాలయంలో వేచి చూశారు. ఎంతకీ సభ్యులురాకపోవడంతో సమావేశానికి వాయిదా వేస్తున్నట్లు ఈవోపీఆర్‌డీ రాంమోహన్ ప్రకటించారు. మరలా ఈ నెల 19న సమావేశానికి ఏర్పాటు చేస్తున్నామని ఈవోపీఆర్‌డీ రాంమోహన్ తెలిపారు. ఒకేసారి వార్డు మెంబర్లు గైర్హాజరైన విషయం గట్టులో చర్చనీయాంశమైంది.

నూతన విద్యా విధానాలను పాటించాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న జీహెచ్ ఎం

కేటీదొడ్డి: మండల పరిధిలోని గువ్వలదిన్నె, తూర్పుతండా, వాగుతండాలోని పాఠశాలలో బుధవారం ఎల్ఈపి త్రీఆర్ఎస్ ప్రోగ్రాంపై జీహెచ్ ఎం శ్రీనివాస్‌గౌడు సందర్శించారు. పాఠశాలలో రిజిస్టర్లను, తరగతిగదుల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనలో నూతన విధానాలను పాటించాలని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని వంట ఏజెన్సీ మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎంలు దేవకుమార్, సుమతి, హరి, వంశీ, సీఆర్‌పి యుగేందర్ పాల్గొన్నారు.

'పాపన్నగౌడు జయంతిని విజయవంతం చేయండి'

గట్టు: ఈ నెల 18న సర్దార్ సర్వాయి పాపన్నగౌడు జయంతిని ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని మండల గౌడ సంఘం నేతలు ఒక ప్రకటనలో కోరారు. గద్వాలలోని జమ్మిచేడు దగ్గరలోని సీఎన్‌జీ ఫంక్షన్ హాల్లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. మండలం నుంచి గౌడకులస్థు లతో పాటు బహుజనులందరు తరలిరావాలని మండల అధ్యక్షుడు మాచర్ల విజయ్‌గౌడు, జిల్లా ఉపాధ్యక్షుడు గొర్లఖాన్ దొడ్డి వెంకటన్నగౌడు, సలహా దారు వాగదొడ్డి ఐమని చంద్రగౌడు, సమన్వయకర్త రమేష్‌గౌడు తదితర గౌడ సంఘం నేతలు కోరారు.

మాంసం ధరలు

మటన్ కిలో	రూ.440
చికెన్ స్కిన్ లెస్	రూ.180
స్కిన్ తో	రూ.160
నాటుకోడి కిలో	రూ.350

చేపల ధరలు

దూబొచ్చ కిలో	రూ.130
పొందుగ	రూ.350
బొచ్చ	రూ.300
కొర్రమట్టలు	రూ.400

సార్లొస్తలేరు..?

- ఎక్సైజ్ శాఖలో ఎక్కడి పనులు అక్కడే
- లోపించిన పర్యవేక్షణ
- విధుల్లో చేరకపోవడానికి కారణం రాజకీయాలేనా?



జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయం

(ఆంధ్రజ్యోతి,గద్వాల): ఎక్సైజ్ సూపరింటెం డెంట్‌తో పాటు గద్వాలటౌన్ సీఐ విధుల్లో చేరడం లేదు. బదిలీ జరిగి నెల రోజులు కావస్తున్న విధుల్లో చేరకపోవడానికి కారణాలు ఏమిటంటూ డిపార్ట్‌మెంట్‌లోను ఎక్సైజ్ శాఖ తో అనుబంధంగా ఉన్న కల్లుడిపోలు, మద్యంషాపుల వ్యాపారుల్లో గుసగుసలు మొదలయ్యాయి. గతంలో పనిచేసిన ఎక్సైజ్ సూపరిండెంట్‌తో పాటు సీఐ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కొనసాగుతూ సంవత్సరాలుగా ఇక్కడే పనిచేసిన ఘనతను సాధించారు. కాని ఈ మధ్యన జరిగిన బదిలీల్లో ఎక్సైజ్ సూపరింటెం డెంట్‌తోపాటు ఇద్దరు సీఐలు బదిలీ అయ్యారు. వారిస్థానంలో వచ్చిన ఎక్సైజ్ సూపరిండెంట్ ఒకరోజు విధుల్లో చేరి సెలవులో వెళ్లిపోయారు. టౌన్ సీఐ స్థానం లో రావాల్సిన సీఐ నేటికి రాలేదు. గద్వాలలో ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో అసలు ఏం జరుగుతుందనే విషయం ఎవరికి అంతుపట్టని పరిస్థితి.

● కారణాలు ఎన్నో...

గద్వాల ఎక్సైజ్‌సూపరింటెడెంట్‌గా జనార్దన్ రెడ్డి, గద్వాల సీఐ నాగార్జునరెడ్డి చాలా కాలంగా ఇక్కడే పనిచేశారు. మద్యం వ్యాపారులతోను, కల్లు దుకాణాలతో అనుబంధాలతో పెనవేసుకున్న వారిని ఆబ్కారి శాఖలో జరిగిన బదిలీలో భాగంగా జనార్దన్ రెడ్డిని జడ్చర్లకు, నాగార్జునరెడ్డిని మరో చోటుకు బదిలీ చేశారు. ఎక్సైజ్ సూపరిండెంట్ స్థానంలో రావాల్సిన పంచాక్షరి వచ్చి విధుల్లో చేరి సెలవులో వెళ్లిపోయారు. వెళ్లిపోయిన ఆయన ఇప్పటి వరకు రాలేదు. గద్వాల సీఐగా పనిచేస్తున్న నాగార్జునరెడ్డి స్థానంలో కృపాకర్‌రెడ్డి రావాల్సి ఉండగా ఆయన ఇంత వరకు విధుల్లోనే చేర లేదు. దీంతో ఎక్సైజ్ శాఖలో ఉన్నతాధికారులు లేకపో వడంతో కింది స్థాయి సిబ్బంది ఏం చేయాలనే పరిస్థి తిలో ఉండిపోయారు.

● విధుల్లో చేరకపోవడానికి కారణం రాజకీయాలేనా?

గద్వాలలో కల్లు మాముళ్లతో పాటు లిక్కర్ వ్యాపారంలో బడాబాబులు ఉన్నారు. వీరందరికి రాజకీయ అండదండలు దండిగా ఉన్నాయి. గతంలో పనిచేసిన వీరు రాజకీయ నాయకులు చెప్పిన రీతిలోనే నడుచుకోవడంతో ఎలాంటి సమస్యలు రాకుండా కాలం గడిచిపోయింది. కాగ, ఈ మధ్యనే కొత్తగా గద్వాల జిల్లా ఏర్పడటంతో ఎస్పీ, కలెక్టర్‌లు కల్తీ కల్లు, నకిలీ మద్యంపై ఉక్కుపాదం మోపాలని ఇచ్చిన ఆదేశాల మేరకు దాడులు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో గతంలో పనిచేసిన ఎక్సైజ్ యంత్రంగానికి ఉన్నతాధికారుల ఆదేశాలు సంకటంగా మారాయి. ఇదే సమయంలో బదిలీలు రావడంతో సంకలెగరేసుకుంటూ వెళ్లిపోయారు. వచ్చే వారు ఇక్కడున్న రాజకీయ పరిస్థితులను చూసి తమకెందుకులే ఈ కూపీలోకి వెళ్లడమంటూ భావించిన వారు విధుల్లో చేరడానికి ముందుకు రావడం లేదు. చేరిన సూపరింటెడెంట్ సెలవులో వెళ్లిపో యారు. సూపరింటెండెంట్ తన భార్య వరంగల్ పనిచేస్తుందని, కూతురు హైదరా బాద్‌లో చదువుతుందని పలు సాకులు చెప్పి గద్వాలకు రావడానికి ఇష్టం చూపడంలేదు. దీనికి తోడు హైద్రాబాద్ నుంచి గద్వాల దూరంగా ఉందనే సాకు కూడా చూపిస్తున్నారు.

● ఎక్సైజ్ శాఖలో ఎక్కడి పనులు అక్కడే

గతంలో పనిచేసిన ఎక్సైజ్ అధికార యంత్రాంగం వల్ల గద్వాలకు రావాల్సిన రెండు బార్‌లు రాకపోవడంతో ప్రభుత్వ ఖజానాపై రూ.3.50కోట్ల నష్టం వాటిల్లింది. మరో పక్క ఉద్యోగులకు జీతాలు చెల్లించ డం కూడా ఆగిపోయాయి.

వీటికి తోడు గద్వాలలో కల్తీకల్లు వ్యవహారం జోరుగా సాగుతున్నక్రమంలో మళ్లీ దాడులు చేయాల్సి వస్తుందనే భయంతో గద్వాలకు బదిలీ అయిన ఎక్సైజ్‌అధికారులు రావడానికి జంకు తున్నారని సమాచారం.

ఎంప్లాయిమెంట్ కార్డులను రెన్యూవల్ చేయించుకోండి

● జిల్లా ఉపాధికల్పనాధికారి మోహన్ లాల్

గద్వాలక్రైం: ల్యాప్స్ అయిన ఎంప్లాయిమెంట్ కార్డులు డిసెంబర్ 31 లోపు రెన్యూవల్ చేపించుకోవచ్చని జిల్లా ఉపాధికల్పనాధికారి మోహన్ లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1, 2000 నుంచి జులై 31, 2017 వరకు ల్యాప్స్ అయిన ఎంప్లాయిమెంట్ కార్డులను రెన్యూవల్ చేసుకొవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిదని తెలిపారు. ఈ కార్డులతో పాటు తమ చిరునామా ఉన్న కవర్లను జతచేయాలని ఆయన కోరారు.

ఆటోడ్రైవర్లకు డ్రస్‌కోడ్ తప్పనిసరి

● ట్రాఫిక్ ఎస్సై వెంకటేష్



ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్సై

గద్వాలక్రైం: ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా డ్రస్‌కోడ్ పాటించాలని ట్రాఫిక్ ఎస్సై వెంకటేష్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి ఆటోడ్రైవర్ పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. డ్రైవర్ ప్రక్కన ఎవరిని కూర్చోనీయవద్దని సూచించారు. తమవెంట డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ బుక్ ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ తప్పకుండా ఉండాలని సూచించారు.

రేపు సర్దార్ సర్వాయి పాపన్నగౌడు జయంతి

గద్వాలటౌన్: ప్రముఖ స్వాతంత్ర్యయోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడు జయంతిని ఈ నెల 18న జమ్మిచేడు సమీపంలోని సీఏజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నామని జోగుళాంబ గద్వాల జిల్లా గౌడ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాష్‌గౌడు, హరిప్రసాద్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు డాక్టర్ ఆంజనేయగౌడు, సినీరచయిత ప్రముఖ కళాకారుడు జయరాజ్ హాజరవతారన్నారు. జిల్లాలోని గౌడ కులస్తులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

మరుగుదొడ్ల పరిశీలన



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న అధికారులు

గద్వాలరూరల్: మండల పరిధిలోని సంగాలలో నిర్మాణం జరుగుతున్న మరుగుదొడ్లను ఎంపీడీవో నరేంద్రకుమార్ పరిశీలించారు. స్వచ్ఛభారత్ లో భాగంగా ప్రతి ఒక్కరు మరుగు దొడ్లను నిర్మించుకోవాలని సూచించారు. గతంలో నిర్మించిన వారికి బిల్లులను అందజేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శకుంతల, ఫీల్డ్ అసిస్టెంట్ మద్దిలేటి ఉన్నారు.

ఐదుగురి బైండోవర్

గద్వాలరూరల్: మండల పరిధిలోని రేపల్లె గ్రామంలో గురువారం వృషభరాజుల బలప్రదర్శన కార్యక్రమం ఉండగా దాని నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఎఎస్ఐ వెంకట్రాముడు గ్రామానికి చేరుకుని హనుమంతు, బోయరంగన్న, పెద్దకొండన్న, మునెప్ప, బోయ ఈశ్వరన్నను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ రాజు ముందు హాజరుపరిచారు. వృషభరాజుల బలప్రదర్శనను నిర్వహించకూడదని వారికి సూచించి విడుదల చేశారు.

పేకాట స్థావరాలపై దాడులు

● రూ.8300నగదు స్వాధీనం

గద్వాలక్రైం: జోగుళాంబగద్వాల జిల్లా కేంద్రంలోని అయిజ రోడ్ సమీపంలో ఉన్న మణికంఠ వేబ్రిడ్జి దగ్గర మంగళవారం సాయంత్రం పేకాడుతున్న వ్యక్తులపై దాడులు నిర్వహించారు. వారి వద్దనుంచి 8300నగదును స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం మేరకు మంగళవారం సాయంత్రం పేకా ఆడుతున్న మధుకర్, రాము, బాబా, వీరేష్, మందా నర్సింహ్మా అను ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సమ్మెలో తపాలా ఉద్యోగులు

గద్వాలటౌన్: డిమాండ్ల సాధన కోసం అఖిలభారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం పిలుపుమేరకు జిల్లాలోని గ్రామీణ తపాలా ఉద్యోగులు బుధవారం పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయం ముందు నిరవధిక సమ్మెను ప్రారంభించారు. ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు సురేంద్రయ్య మాట్లాడుతూ యూనియన్లకు అతీతంగా ఉద్యోగులందరూ సమ్మెలో పాల్గొంటున్నారని చెప్పారు. జీడీఎస్ గ్రామీణ ఢాకా సర్వెంట్లకు 8గంటల పనికల్పించి సవిల్ సర్వెంట్ హోదా ఇవ్వాలనీ, ఢిల్లీ, మద్రాస్ క్యాట్‌బెంచ్ తీర్పుప్రకారం పెన్షన్ మంజూరు చేయాలని, టార్గెట్ల పేరుతో వేధింపులకు గురిచేయొద్దని అన్నారు. ఈ సమ్మెలో సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, కోశాధికారి మహేశ్వర్‌రెడ్డి, విశ్వనాథం, ఎం. తిమ్మప్ప, మద్దమ్మ, మౌనిక, ఈశ్వరమ్మ, శ్రీకళ, శాంతి, సవారన్న, ఎజాజ్, ఇస్మాయిల్, భద్రప్ప, రవీందర్, ఉస్మాన్, మహ్మద్‌అలీ పాల్గొన్నారు.

'జూరాల నీటిని దుర్వినియోగం చేయొద్దు'

ఆత్మకూర్: జూరాల నీటిని దుర్వినియోగం చెయొద్దని మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని రామలక్ష్మారెడ్డి స్వగృహంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎగువ నుంచి వరద నీరు రాకుండానే దిగు వకు రెండు కాలువల ద్వారా అధికారులు నీరు వదిలితే ఎలా అని ఆయన ప్రశ్నించారు.అమరచింత, ఆత్మకూర్, మదనాపురం మండలాలకు కలిపి విద్యుత్ ఏడీ కార్యాలయం ఆత్మకూర్‌లోనే ఉండాలని ఆయన సూచించారు. ఈ విషయమై సీఎండీ, ఎస్ఈతో పాటు వనపర్తి, మహబూబ్‌నగర్, విద్యుత్ ఉన్నత అధికారులు దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో నాయకులు జగదబిరాంరెడ్డి, ఎంపీటీసీ అశ్వినికుమార్, బాలకిష్టరెడ్డి, రమేష్, మాజీ సర్పంచు రాములు పాల్గొన్నారు.

'మహిళలను వేధిస్తే చర్యలు'



సమావేశంలో మాట్లాడుతున్న షీటీం సభ్యులు

గద్వాలక్రైం: మహిళలను, విద్యార్థినులను వేధిస్తే చర్యలు తప్పవని షీటీం హెడ్‌కానిస్టేబుల్ శ్రీదేవి, సిబ్బంది దివ్య, వినోద్‌లు అన్నారు. బుధవారం జోగుళాంబగద్వాల జిల్లా కేంద్రంలోని నవోదయ పాఠశాలలో విద్యారినులకు షీటీం సభ్యులు ఎస్పీ విజయ్‌కుమార్ ఆదేశానుసారం అవగాహన సభను నిర్వహించారు. షీటీం సిబ్బంది మాట్లాడుతూ ఎవరైనా రోడ్లపై మహిళలను, విద్యార్థినులను వేధిస్తే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థిలను వెంటపడి వేధించడమేకాకుండా సెల్‌ఫోన్‌లో అసభ్యకర మెసేజ్‌లు పెట్టిన వారు శిక్షార్హులన్నారు. ఎవరైనా మహిళలు, విద్యార్థినులను ఆకతాయిల నుంచి వేధింపులకు గురవుతున్నట్లుయితే సెల్: 7780353810కు సమాచారం ఇవ్వాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. విద్యార్థినులు, షీటీం సభ్యులు పాల్గొన్నారు.

'రుణాలు నిబంధనల ప్రకారం ఇవ్వాలి'

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది విడుదల చేస్తున్న కార్పొరేషన్ రుణాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే లబ్దిదారులకు మంజూరు చేయాలని అంబేద్కర్ జాతర కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ అన్నారు. బుధవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం యూనిట్ల వారిగా టెంట్‌హౌస్, నెట్‌సెంటర్, వాహనాలకు రూ. 3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు లోన్ ఇవ్వాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. వాటికి వి రుద్ధంగా బ్యాంకు మేనేజర్లు యూనిట్లు పెంచకుండా రుణవ్యయాన్ని కుదించి ఎక్కువ మందిని ఎంపిక చేసి అందరికి లక్ష రూపాయల చొప్పున ఇస్తున్నారు. దీంతో లబ్ధిదారులు నష్టపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శ్యాంసుమన్, ప్రదీప్ కృష్ణయ్యలు ఉన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు దాతల సహకారంతో టై, బెల్టులు పంపిణీ చేశారు. బుధవారం పాఠశాలలోని విద్యార్థులకు ఎన్ఆర్ఐ తౌఫిక్‌అహ్మద్ 130 మంది విద్యార్థినులకు టై, బెల్టుల నిమిత్తం సహాయం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతి ఏడాది తౌఫిక్ అందిస్తున్న సహకారం మరవలేనిదన్నారు.

ఏజెన్సీ ధ్రువపత్రాలు అందించాలి

• గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ధర్మానాయక్



తహసీల్దార్‌కు ధ్రువపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

అమ్రాబాద్‌: ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని గత నెల 19న సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని, ఏజెన్సీ మండలమైన అమ్రాబాద్‌లో వెంటనే అమలు చేసి ధ్రువపత్రాలు ఇవ్వాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మానాయక్‌ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు కాపీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల ఆధారంగా ఏజెన్సీ ధ్రువపత్రాలు అందించి ఈ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజన తెగలకు అన్ని విధాలుగా న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌ మాట్లాడుతూ హైకోర్టు అనుమతిచ్చిన ఆధారంగా ఉన్నతాధికారులతో చర్చించి అర్హులైన వారికి ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శంకర్‌నాయక్‌ తదితరులు ఉన్నారు.

పత్తిపంటలో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి

• కేవీకే ప్రిన్సిపాల్‌, సైంటిస్టు డాక్టర్‌ ఎం. జగన్మోహన్‌రెడ్డి



పత్తి పంటలో తెగుళ్లను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు

నాగర్‌కర్నూల్‌ వ్యవసాయం: సాధారణ వర్షాపాతం కురవడం వలన బెట్ట పరిస్థితిలో పత్తి పంటకు తెగుళ్ల ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, శాఖీయ దశ నుంచి గూడ, పూత దశలో పత్తి పంట ఉందన్నారు. ఈ దశలో రసం పీల్చే పురుగులైన పేనుబంక, తెల్లదోమ, తామర పురుగు ఆశించి పంటను తీవ్రంగా నష్టపరుస్తాయని కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపాల్‌ సైంటిస్టు డాక్టర్‌ ఎం.జగన్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పాలెంలో పంటను పరిశీలించి రైతుల తప్పక సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. బెట్ట పరిస్థితులు కల్పించినట్లయితే రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువవుతుందన్నారు. వాటి నివారణకు పిప్రోనిల్‌ 2మి.లీ లేదా డైపెన్‌ తుర్లాన్‌ 1.25 గ్రాములు లీటర్‌ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. 45 రోజుల నుంచి గులాబీ రంగు పురుగు వచ్చే అవకాశం ఉన్నందున మొదటగా పూతకు వచ్చిన పత్తి చేనులో ఒక ఎకరాకు 8 చొప్పున లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. వీటి ఉధృతి ఎక్కువగా ఉండి తెల్లరెక్క పురుగుల బుట్టలో పడినట్లయితే 5శాతం వేపగింజ కషాయం లేదా 5మిల్లీలీటర్ల నీటికి వేపనూనె, ప్రొంఫోవిట్‌ జిగురు మందును కలిపి పిచికారి చేయాలని సూచించారు.

రైలు ఢీ కొని వృద్ధుడికి తీవ్ర గాయాలు



గాయపడిన రాంచంద్రారెడ్డి

మదనాపురం: వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని కొన్నూర్‌ గ్రామ సమీపంలో వృద్ధుడు పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొనడంతో కోమాలోకి వెళ్లాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొన్నూర్‌ గ్రామానికి చెందిన రాంచంద్రారెడ్డి (72)కి చెవులు సరి గా వినపడవు. బుధవారం తెల్లవారు జామున బహిర్భూమి నిమిత్తం పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టడంతో ఎగిరి ముళ్ల పొదల్లో పడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం వనపర్తి జిల్లా కేంద్రానికి తరలించారు. సాయంత్రం పరిస్థితి విషమించడంతో మహబూబ్‌నగర్‌ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఉమ్మడి జిల్లాకు కృష్ణా నీటివాటాను తేల్చాలి

• నార్లాపూర్‌ నుంచి డిండికి పంపే అర టీఎంసీ నీటిని ఆపాలి

• సీపీఎం వనపర్తి జిల్లా కార్యదర్శి ఎండీ. జబ్బార్‌



మాట్లాడుతున్న సీపీఎం వనపర్తి జిల్లా కార్యదర్శి

వనపర్తి టౌన్‌: ఉమ్మడి పాలమూరు జిల్లాకు కృష్ణానీటి వాటాను ప్రభుత్వం వెంటనే తేల్చాలని నార్లాపూర్‌ నుంచి డిండికి పంపే అర టీఎంసీ నీటిని ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ. జబ్బార్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రిజేష్‌కుమార్‌ తీర్పును ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రెండుగా విభజించి ఫేస్‌ 1 గా జూరాల నుంచి వచ్చిన ఉత్తర్వులను అమలు చేసి ఫేస్‌-2 శ్రీశైలం నుంచి చేపట్టిన పథకాన్ని కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్‌లో భాగం చేయాలన్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. నిర్వాసితులకు భూమికి భూమి, ఇళ్లిచ్చి ఇంటికొక ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. జూరాలలో నీటి కేటాయింపు ప్రకారం 18 టీఎంసీలు నిలువ ఉండే విధంగా ప్రాజెక్టు ఎత్తు పెంచాలన్నా రు. జూరాల కుడికాల్వ గేట్లను ఎత్తుపెంచి 9 రోజుల్లో జిల్లాలో ఉన్న 8374 చిన్న చెరువులు, 574 పెద్ద చెరువులను నింపాలని కోరారు. కర్ణాటకలో అక్రమంగా నిర్మిస్తున్న గిరిజా ప్రాజెక్టు ఆపేందుకు కర్ణాటక ప్రభుత్వంతో తెలంగాణ ప్రభుత్వం మాట్లాడి ఆపాలన్నారు. ఆర్‌డీఎస్‌ కింద 15.9 టీఎంసీల నీటితో 87 వేల వేల ఎకరాలకు నిరు ఇవ్వాలన్నారు. కానీ జూరాలలో 7 టీఎంసీలు ఆర్‌డీఎస్‌ 5 టీఎంసీ లు మాత్రమే నిల్వ ఉంచుతున్నారని పూర్తి స్థాయిలో నీటిని కేటాయించి అందివ్వాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు పుట్ట ఆంజనేయులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కమలేష్‌ చంద్ర కమిటీ నివేదికను అమలు చేయాలి

• ఏఐజీడీఎస్‌యూ డివిజన్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ లక్ష్మీకాంత్‌



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న జీడీఎస్‌ ఉద్యోగులు

నాగర్‌కర్నూల్‌ టౌన్‌: గ్రామీణ్‌ డాక్‌ సేవక్‌(జీడీఎస్‌) ఉద్యోగుల పరిస్థితులు, వేతనాల పెంపు కోసం నియమించబడిన కమలేష్‌ చంద్ర కమిటీ నివేదికను వెంటనే అమలు చేయాలని ఆల్‌ఇండియా గ్రామీణ డాక్‌ సేవక్‌ యూనియన్‌ (ఏఐజీడీఎస్‌యు) వనపర్తి డివిజన్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ జి.లక్ష్మీకాంత్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తపాలా కార్యాలయంలో గ్రామీణ తపాల ఉద్యోగుల నిరవధిక సమ్మెను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలేష్‌ చంద్ర కమిటీ నివేదిక కేంద్ర ప్రభుత్వానికి అందజేసి 9 నెలలు గడుస్తున్నా నేటికి అమలు చేయకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ తపాలా ఉద్యోగులకు 8 గంటల పనిని కల్పించి సివిల్‌ సర్వెంట్ల హోదా ఇవ్వాలని ఢిల్లీ, మద్రాసు కోర్టుల ఇచ్చిన తీర్పులను అమలు పరుచాలని, పెన్షన్‌ సౌకర్యం కల్పించాలని డిమాండ్‌ చేశారు. అనంతరం తపాలా కార్యాలయం నుండి ర్యాలీగా వెళ్లి డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐజీడీఎస్‌యు డివిజన్‌ కార్యదర్శి శంకరయ్య, నాయకులు రవి, పరమేశ్వర్‌, రాము, పురుషోత్తంరెడ్డి, బాలాజీ, వెంకటయ్య, రాజేందర్‌రెడ్డి, చిన్నయ్య, పుష్పగిరి, సునిత, నాగేంద్రం, రాధ, రమాదేవి, ఆంజనేయులు, ప్రభావతి, శ్రీలత, జయంతి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్భాటాలే తప్ప అభివృద్ధి శూన్యం

• అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ వంశీకృష్ణ

బల్మూర్‌: తెలంగాణ ప్రజల ఆకాంక్షను తెలుసుకుని సోనియా గాంధీ తెలంగాణను ఇచ్చిందని, రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆర్భాటం తప్ప అభివృద్ధి లేదని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ వంశీకృష్ణ అన్నారు. ఆయన బుధవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్‌ ఆధ్వర్యంలో కేఎల్‌ఐ కాలువలు తీయడం జరిగిందని గుర్తు చేశారు. కాలువలు కాంగ్రెస్‌ హయాంలో తవ్వితే ఇప్పుడు ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నా రు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలు బుద్ధిచెబుతారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ జిల్లా కార్యదర్శి జంగయ్య, మాజీ సింగిల్‌విండో చైర్మన్‌ విష్ణుమూర్తి, సుధాకర్‌గౌడ్‌, నిరంజన్‌గౌడ్‌, లక్ష్మయ్య, మురళి ఉన్నారు.

ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలి

• బీసీ స్టూడెంట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నాగర్‌ కర్నూల్‌ జిల్లా అధ్యక్షుడు



మాట్లాడుతున్న అరవిందాచారి

నాగర్‌కర్నూల్‌ అర్బన్‌: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో డీఎస్సీ వేసి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని నాగర్‌కర్నూల్‌ జిల్లా బీసీ స్టూడెంట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు డి. అరవిందాచారి డిమాండ్‌ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిథిగృహంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు త్వరలోనే టీచర్‌ పోస్టుల భర్తీపై స్పష్టత ఇవ్వాలన్నారు. నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేస్తూ పూర్తి స్థాయిలో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసి ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలుపుకోవాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో కార్తీక్‌, సురేందర్‌, సురేష్‌, తిరుపతి, సంజయ్‌, శివశంకర్‌ తదితరులున్నారు.

కారు ఢీకొన్న ఘటనలో యువతి మృతి

వడ్డేపల్లి: మండల కేంద్రమైన శాంతినగర్‌లో మంగళవారం కారు ఢీకొని యువతి తీవ్రంగా గాయపడడంతో బాధితురాలిని కర్నూలు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ మహేందర్‌ తెలిపారు. ఏ.బూడిదపాడు గ్రామానికి చెందిన నిర్మల (22) ఈ ఘటనలో మృతి చెందిందన్నారు. ఈ సంఘటనకు కారణమైన కారు యజమాని ప్రభాకర్‌రెడ్డి, గుమాస్తా వీరేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పట్టుబడ్డ బియ్యం కేసులో ఆరుగురు అరెస్టు

వడ్డేపల్లి: మండల కేంద్రమైన శాంతినగర్‌కు చెందిన బియ్యం వ్యాపారస్తుల గత వారం రోజుల క్రితం అలంపూర్‌ చౌరస్తాలో ఉన్న రైస్‌మిల్లుకు అక్రమంగా బియ్యంను తరలిస్తుండగా పట్టుబడిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ ఘటనకు పాల్పడ్డ చక్రి, అరవింద్‌కుమార్‌, నాగేశ్వరయ్య, పల్లన్నగౌడ్‌, హుసేన్‌, అస్లాంలను అరెస్టు చేసి బుధవారం రిమాండుకు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు. అక్రమంగా బియ్యం రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ మహేందర్‌ తెలిపారు.

వంట గ్యాస్ సమాచారం

శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ సమాచార ఫోన్ నెంబర్లు
08546278365, 9515641645, 7013959880

వంట గ్యాస్ సిలిండర్ ఆన్‌లైన్ బుకింగ్ కోసం
9666023456

సినిమా గైడ్



భువనేశ్వర్ - లై
శివసాయి - జయ జానకి నాయక
మాధవ్ - నేనే రాజు నేనే మంత్రి

కూరగాయల ధరలు



టమాట	50	చిక్కుడు	60
వంకాయ	60	ఉల్లి	40
కాకర	40	బీన్స్	60
బెండ	30	బీట్‌రూట్	60
దొండ	30	పచ్చిమిర్చి	40
ఆలు	30	క్యారెట్	80
క్యాబేజీ	30	ముల్లంగి	60
కాలీఫ్లవర్	50	బీరకాయలు	30
క్యాప్సికం	50	దోసకాయ	40

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

- మట్టివి కావడంతో పెద్దఎత్తున ఏర్పడ గుంతలు
- ప్రయాణించాలంటే ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు
- బీటీ రోడ్డు కోసం పలుమార్లు విన్నపం
- పట్టించుకోని అధికారులు, పాలకులు

ఇటిక్యాల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రధాన ధ్యేయమంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్నా.. శివారు గ్రామాల్లో మాత్రం అభివృద్ధి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ముఖ్యంగా రోడ్ల సౌకర్యం లేక ఎక్కడైనా ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ఆయా గ్రామస్థులు. మోకాటిలోతు గుంతలతో నిండిన మట్టి రోడ్లే దిక్కవడంతో వాటిపై ప్రయాణించలేక నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ఇటిక్యాలమండలంలోని పలు గ్రామాల్లో ఈ దుస్థితి నెలకొంది.

ముఖ్యంగా మండలంలోని గోపల్ దిన్నె, పెద్దదిన్నె గ్రామాలు మండల కేంద్రానికి పదికిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అయితే ఆయా గ్రామాలకు వెళ్లేందుకు సరైన రోడ్లు లేవు. ఉన్నవి మట్టివి కావడంతో పెద్దఎత్తున గుంతలు పడ్డాయి. దీంతో వాటిపై ప్రయాణించలేకున్నామని, కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని దుస్థితి నెలకొందని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు. వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని, పూర్తి బురదయమంగా ఉంటుండడంతో నడిచేందుకు కూడా వీలు కాని పరిస్థితి ఏర్పడుతోందని అంటున్నారు.

గతంలో గద్వాల నుంచి ప్రతినిత్యం ఆర్టీసీ బస్సు పూడూరు మీదుగా తమ గ్రామాలకు వస్తుండేదని, ఇప్పుడు రోడ్లు గుంతలు పడి అధ్వానంగా ఉండడంతో అధికారులు బస్సులను రద్దు చేశారని, దీంతో గ్రామాలకు రవాణా సౌకర్యం లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. అలాగే చాగాపురం, బుడ్డారెడ్డిపల్లి, షాబాద్, శనగపల్లి గ్రామాల రోడ్లతో పాటు జాతీయ రహదారి నుంచి వెళ్లే ధర్మవరం, బీ. వెంగన్నపల్లి గ్రామాల రోడ్లు మట్టివి అయి పెద్దఎత్తున గుంతలు పడడంతో అక్కడా బస్సు సర్వీసులను నడపడం లేదు. మా గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం, కల్పించి బస్సులు నడపాలని పలుమార్లు సంబంధితాధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించామని, ఫలితం లేకపోయిందని ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బస్సులు రాకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నామని అంటున్నారు. బస్సులు రాని కారణంగా విద్యార్థులు బయట ఊర్లకు వెళ్లి పై చదువులు చదవలేకపోతున్నారని చెబుతున్నారు. ఇన్ని సమస్యలున్న తమ గ్రామాల వైపు ఎవరూ కన్నెత్తి చూడకపోవడం శోచనీయమని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి తమ గ్రామాలకు బీటీ రోడ్లు వేసి బస్సులు నడపాలని వారు కోరుతున్నారు.



బుడ్డారెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే దారి ఇలా



దుస్థితిలో పూడూరు నుంచి ఇటిక్యాలకు వెళ్లే రోడ్డు

బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలి..



పూడూరు నుంచి గోపల్‌దిన్నె గ్రామం మీదుగా పెద్దదిన్నె వరకు బీటీ రోడ్డు వేయాలి. రోడ్డు సౌకర్యం ఉంటే అన్ని విధాలా గ్రామాలు అభివృద్ధి చెందుతాయి.

- సుందరన్న, మాజీ సర్పంచ్, గోపల్‌దిన్నె

ప్రజాప్రతినిధులకు విన్నవించాం ..

మా గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గత నాలుగేళ్లుగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేదు. గ్రామీణ ప్రజల సౌకర్యార్థం ప్రతి శివారు గ్రామానికి బీటీ రోడ్డు వేయాలి.

- నడిపి కృష్ణ, బుడ్డారెడ్డిపల్లి

● ఇంటర్వ్యూ

నగర పంచాయతీ అభివృద్ధికి కృషి

● రాజేశ్వరి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ , అయిజ



అయిజ టౌన్: అయిజ పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల్ని పరిష్కరిస్తున్నానని, నగర పంచాయతీ చైర్‌పర్సన్ రాజేశ్వరి తెలిపారు. అయిజ పట్టణాన్ని జిల్లా కేంద్రానికి అనుగుణంగా తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో పని చేస్తున్నామని పేర్కొన్నారు. ఆమెను బుధవారం ఆంధ్రజ్యోతి పలకరించగా పలు విషయాలు వెల్లడించారు.

నగరపంచాయతీకి వచ్చిన నిధులు ఎన్ని, వాటి వినియోగం ఎలా ఉంది?

రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఎస్ఎఫ్‌సీ నిధులు రూ. 50 లక్షలను మంజూరు చేయించారు. అలాగే ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.52లక్షలు, 13వ ఆర్థిక సంఘం నిధులు రూ.60 లక్షలు రాగా.. వాటన్నంటినీ పట్టణాభివృద్ధికి వినియోగించాం. 14వ ఆర్థికసంఘం నిధులు రూ.2.50 కోట్లు రాగా.. వాటిలో రూ1.50 కోట్ల నిధులను మార్కెట్ నిర్మాణానికి, రూ.1 కోటిని సీసీ రోడ్డు ,డ్రైన్ ల నిర్మాణాలకు వినియోగిస్తున్నాం. ఏఎస్సీ నిధులు రూ.20 లక్షలు తాగునీటి పైప్ లైన్ , మరో ఏఎస్సీ నిధులు రూ45 లక్షలతో వివిధ పనులు జరుగుతున్నాయి. నగరపంచాయితీ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

నగరపంచాయితీ అభివృద్ధికి మీరు చేపట్టిన నూతన రూపకల్పనలేంటి?

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, వార్డులను సందర్శిస్తూ సమస్యల్ని తెల్సుకొని అక్కడే పరిష్కరిస్తున్నాం.

స్వచ్ఛ పట్టణంగా మార్చేందుకు చేపట్టిన చర్యలు?

ప్రతిఇంట మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల ఏర్పాటుతో పాటు రోడ్లపై ఎప్పటికప్పుడు చెత్తను తొలగింపజేస్తున్నాం.

'సర్దార్ పాపన్న జయంతికి తరలిరండి'

వడ్డేపల్లి: సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ 365వ జయంతి వేడుకలు ఈనెల 18వ తేదీన జరగనున్నాయని, మండలకేంద్రంలో జరిగే కార్యక్రమానికి జిల్లాలోని కల్లుగీత కార్మికులు పెద్దఎత్తున తరలి రావాలని తెలుగునాడు కల్లుగీత కార్మిక సంఘంసభ్యుడు గజేందర్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

మంత్రి ఆది నారాయణ దళితులకు క్షమాపణ చెప్పాలి

ఇటిక్యాలరూరల్: దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి ఆది నారాయణ దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎంఎస్ఎఫ్ తాలుకా అధ్యక్షుడు అవినాష్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మాట్లాడిన ఆయన దళితులకు చదువురాదు, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించరు అని అనుచిత వ్యాఖ్యలు చేయడంపై దళితసంఘాలు మండిపడ్డాయి. అగ్రకుల దురహంకారంతో అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. దళితులకు క్షమాపణ చెప్పాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు మంత్రిపై చర్యలు తీసుకోవాలని కోరారు లేకపోతే ఆమంత్రిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని అన్నారు.

ఘనంగా సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠ అయిన సరస్వతీ దేవి విగ్రహం

అయిజ: మండలంలోని సంకాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం చదువుల తల్లి సరస్వతీ దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దాతలు, గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో ప్రతిష్ఠ కొనసాగింది. దాతలు కాపు వెంకటరెడ్డి, మహదేవమ్మల సహకారంతో నిర్మించిన మంటపంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు రాముడు, ఉపాధ్యక్షుడు సంజన్న, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తిమ్మారెడ్డి, రవి, సర్వేశ్వరాచారి, నల్లన్న, గజరాజు, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, హెచ్ ఎం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మీజిల్స్, రుబెల్లాపై అవగాహన ర్యాలీ



ఉండవల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్యసిబ్బంది



అయిజలో సాగుతున్న ర్యాలీ

ఉండవల్లి: తట్టు, రుబెల్లా అనే రెండు ప్రాణాంతక వ్యాధుల నివారణకు గురువారం ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏఎన్ఎంలు షాజాన్, వినోదిని తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం వారు స్థానిక జడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో కలిసి పురవీధుల్లో రుబెల్లా, మీజిల్స్‌పై అవగాహన ర్యాలీని చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గురువారం నుంచి సెప్టెంబర్ 25వ తేదీ వరకు ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. తట్టు ప్రాణాంతకరమైన వ్యాధి అని, దీనివలన చిన్నారులు న్యూమోనియా, విరేచనాలు, మెదడువాపు వంటి వాటికి గురవుతారని, ఇది దగ్గడం, తుమ్మడం ద్వారా ఇంకొకరికి సోకుతుందని తెలిపారు. అలాగే రూబెల్లా జ్వరంతో ఉన్న మహిళలకు సోకితే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని చెప్పారు. కావున 9నెలల పిల్లల నుంచి 15 ఏళ్ల వయసున్న ఉన్న ప్రతి ఒక్కరూ ఈ టీకా వేయించుకోవాలని సూచించారు. ఈ టీకాను అన్ని ప్రభు త్వ, ప్రైవేటు పాఠశాలలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో వేస్తారని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అయిజ: మండలకేంద్రంలో రుబెల్లా టీకాపై అవగాహన ర్యాలీలు సాగించారు. స్థానిక ఆస్పత్రి సిబ్బంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పురవీధుల్లో తిరుగుతూ ఆయా టీకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పాతబస్టాండు, పోలీస్టేషన్ రోడ్, కొత్తబస్టాండు మీదుగా సాగింది. 9 నెలల నుంచి 15 ఏళ్ల వరకు వయసున్న వారికి మిజిల్స్, రుబెల్లా టీకాలు వేయించాలని డాక్టర్ మాలకొండయ్య సూచించారు. ఈ కార్యక్రమం గురువారం నుంచి కొనసాగుతుందని, అర్హులు వినియోగించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో హెచ్ ఎం మేరమ్మ, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ మేరకు ర్యాలీ నిర్వహించారు.

రుబెల్లా, మీజిల్స్ వాక్సిన్లు తప్పక వేయించాలి..

ఇటిక్యాల: చిన్నారులను ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడేందుకు మీజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్ తప్పక ఇప్పించాలని మండలకేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యుడు సూఫియా యాస్మిన్ సూచించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గురువారం నుంచి 31వ తేదీవరకు మండలంలో 9 నెలల నుంచి 15ఏళ్ల వయసున్న వారందరికీ మీజిల్స్ వ్యాక్సిన్ వేస్తామని చెప్పారు. మండలం మొత్తం 13,810 మంది చిన్నారులున్నారని, మొదటి రోజు 1210మందికి ఆయా పాఠశాలలో వ్యాక్సిన్ వేస్తామని, తర్వాత 31వరకు పాఠశాలల్లోనే వ్యాక్సిన్ ఇచ్చిన తర్వాత రెండో విడత అంగన్ వాడీ కేంద్రాల్లో సెప్టెంబర్ 1నుంచి 12వరకు వేస్తామని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధ, శనివారాల్లో తప్ప మిగతా రోజుల్లో ప్రతి రోజూ వేస్తామని తెలిపారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 8

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. విద్యా సంస్థలతో పనులు పూర్తవుతాయి. ప్రియతముల నుంచి ఆహ్లాదకరమైన సమాచారం అందుకుంటారు. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లకు అనుకూలం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): ఆర్థిక విషయాల్లో మీ వైఖరిని సమీక్షించుకుంటారు. కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్థిక పరమైన లక్ష్యాలు సాధిస్తారు. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి శుభప్రదం.

మిథునరాశి: (మే21-జూన్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు ఫలిస్తాయి. ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. రాజకీయ, సినీరంగాల వారికి ప్రోత్సాహకరం. శుభవార్త అందుకుంటారు. రవాణా, బోధన రంగాల వారికి అనుకూలం.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ఉన్నత విద్యకు అవసరమైన నిధులు సమకూర్చుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. దూరప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులు లాభిస్తాయి.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. పెట్టుబడుల విషయాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): వృత్తి, వ్యాపారాలకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. ఉన్నత పదవులు అందుకుంటారు. పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వాయిదా పడుతున్న పనులు పూర్తిచేస్తారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): మిత్రులు, బంధువులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సంకల్పం నెరవేరుతుంది.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. బీమా, గ్రాట్యుటీ, పింఛన్ వ్యవహారాలు పూర్తవుతాయి. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అవకాశం ఉంది. మెడికల్ క్లెయిములు పరిష్కారం అవుతాయి.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు సంభవం. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. నూతన భాగస్వామ్యాలు లాభిస్తాయి. జనసంబంధాలు విస్తరిస్తాయి. సంకల్పం నెరవేరుతుంది.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): వైద్య, పరిశ్రమలు, హోటల్, రిటైల్ రంగాల వారికి అనుకూల సమయం. విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): డిపాజిట్లపై మంచి ప్రతిఫలాలు అందకుంటారు. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ప్రేమలు ఫలిస్తాయి. బ్యాంకుల, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బదిలీలు, మార్పులకు అనుకూలం. హోటల్, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి పోత్సాహకరం. సేవల రంగాల వారు సత్ఫలితాలు సాధిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

భక్తి, శ్రద్ధలతో పెద్దకిస్తీ

- సర్కార్ అండాలతో ప్రారంభమైన ఉత్సవం
- కులమతాలకు అతీతంగా పాల్గొన్న ప్రజలు
- అలంపూర్‌లో ఉర్సుసంబురాలు
- కిస్తీలో పాల్గొన్న పహిల్వాన్లు
- సీఐ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు



పెద్దకిస్తీలో పాల్గొన్న భక్త జనసందోహం



దర్గాలోని దోని వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మతపెద్దలు



భక్తులకు అన్నదానం చేస్తున్న మైనార్టీలు

అలంపూర్: జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లోని 767 షాలీ పహిల్వాన్ ఉర్సు ఉత్సవాల్లో భాగంగా బుధవారం పెద్దకిస్తీలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ప్రధానఘట్టమైన పెద్దకిస్తీలో కులమతాలకతీతంగా హిందూ, ముస్లింలు పిల్లాపాపలతో పెద్దకిస్తీలో పాల్గొని తరించారు. ముందుగా షాలీ పహిల్వాన్ దర్గా సమీపంలో ఉన్న దోనిలో దర్గా ఉర్సు నిర్వాహకుడు షార హిమత్ ఓవై ఆధ్వర్యంలో పెద్ద పెద్ద అండాలలో పలావు అన్నంను తీసుకువచ్చి దోనిలో వేసిన అనంతరం కమిటీ ముస్లిం మతపెద్దలు ప్రత్యేక నమాజు చేశారు. అక్కడే వేచి ఉన్నపెద్ద పహిల్వాన్లు దైవప్రసాదంగా భావించే పలావు అన్నంను చుట్టూ వున్న వేలాదిమంది భక్తులకు విసిరేశారు. పలావు అన్నం దొరికిన వారు అదృష్టంగా భావిస్తారు. సర్కారు అండాలే కాకుండా పట్టణంలోని పలు పురవీధుల గుండా ముస్లింలు తీసుకువచ్చిన పలావు అండాలను యువకులు నృత్యాలు చేస్తూ దర్గా వద్దకు తీసుకువచ్చి దోనిలో వేస్తారు.

● అట్టహాసంగా ఉర్సు

ఈ నెల 14న గంధంతో ప్రారంభమైన షాలీపహిల్వాన్ ఉర్సు ఉత్సవాలు మూడవ రోజైన బుధవారం పెద్దకిస్తీ సంబురాలు అట్టహాసంగా జరిగాయి. హిందూ ముస్లిం అనే తేడా లేకుండా అన్ని కులాల ప్రజలు ఈ కిస్తీలో పాల్గొన్నారు. తమ బంధుమిత్రులను ఉర్సు ఉత్సవాలకు పిలిపించుకుని అక్కడ ఏర్పాటు చేసిన మిఠాయిదుకాణాలు, గాజుల దుకాణాలు, ఆట వస్తువుల దుకాణాలను కొనుగోలు చేయించారు.

కిస్తీలో పహిల్వాన్ల కేరింతలు

షాలీపహిల్వాన్ పెద్దకిస్తీలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొనగా ఆ ప్రాంగణం భక్తజన సంద్రంగా మారింది. దీంతో పెద్ద పహిల్వాన్లు కేరింతలు కొడుతూ పలావు అన్నం కోసంపోటీ పడ్డారు. వేడిగా ఉన్న పలావు అన్నంను భక్తులకు విసిరేయడం, కాలుతున్న అన్నంను చేతపట్టుకున్న పహిల్వాన్లకు ఎలాంటి గాయాలు కాకపోవడం షాలీపహిల్వాన్ మహిమగా మతపెద్దలు చెబుతున్నారు.

మైనార్టీల అన్నదానం

షాలీ పహిల్వాన్ ఉర్సుకు హాజరైన భక్తులకు మైనార్టీల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రతిసంవత్సరం పెద్దకిస్తీ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తామని ముస్లిం మతపెద్దలు హమాలీఖాజా, జాఫర్‌లు తెలిపారు.

భారీ పోలీస్ బందోబస్తు

షాలీ పహిల్వాన్ ఉర్సు సందర్భంగా సీఐ సురేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును నిర్వహించారు. ఉర్సులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అలంపూర్, మానవపాడు, శాంతినగర్, ఇటిక్యాల ఎస్‌ఐలు, 60మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.

నేడు మహిళల ఉర్సు

షాలీ పహిల్వాన్ ఉర్సులో భాగంగా గురువారం మహిళల ఉర్సు ఉంటుందన్నారు. ఈ ఉర్సులో మహిళలు మాత్రమే దర్గాను దర్శించుకుంటారు. దర్గా సమీపంలో ఏర్పాటు చేసిన వివిధ వస్తు దుకాణాల్లో మహిళలు వస్తువులను కొనుగోలు చేయడం ఈ ఉర్సు ప్రత్యేకత.



బోనాల పండుగకు పొట్టేళ్ల రథం సిద్ధం

వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలో ఈ నెల 24 నిర్వహించే బోనాల పండుగ సందర్భంగా అమ్మవారి రథాన్ని జోడు పొట్టేళ్ల రథంపై ఊరేగించడానికి సిద్ధం చేస్తున్నారు. పొట్టేళ్లు భయపడకుండా ఉండేందుకు ముందుగా వాటిని ఊళ్లో తిప్పుతూ శిక్షణ ఇస్తున్నారు. ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి బుధవారం తన కెమెరాలో బంధించింది.

- మహ్మద్ యూసుఫ్, ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటో జర్నలిస్ట్

కిలి మంజారోపై పిరట్వానx పల్లి విద్యార్థి



జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న చరణ్‌రాజ్

అచ్చంపేట(ఉప్పునుంతల): ఆఫ్రికా టాంజానియాలోని అత్యంత ఎత్తైన 5895 మీటర్ల కిలీ మంజార పర్వతాన్ని తెలంగాణ విద్యార్థులు అధిరోహించారు. ఈ నెల 14న తెలంగాణ రాష్ట్రానికి చెందిన బీసీ వెల్ఫేర్ సంఘం నుంచి ఏడుగురు విద్యార్థులు బయల్దేరి 15న పర్వతాన్ని అధిరోహించి శిఖరంపై 100 మీటర్ల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పర్వతాన్ని అధిరోహించిన వారిలో నాగర్‌కర్నూల్‌జిల్లా ఉప్పునుంతల మండలం పిరట్వాన్‌పల్లికి చెందిన పెబ్బేటి చరణ్‌రాజు ఉండటంతో జిల్లా ప్రజలు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. కోచ్ శేఖర్‌బాబు, బీసీ వెల్ఫేర్ సెక్రటరి అశోక్‌కుమార్, అలోక్‌కుమార్‌లకు చరణ్‌రాజు కృతజ్ఞతలు తెలిపారు.

రాఘవేంద్ర కాలనీలో చోరీ

- రూ. 28వేల నగదు, సెల్‌ఫోన్ అపహరణ

నాగర్‌కర్నూల్ క్రైం : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ఓ ఇంట్లోకి చొరబడి రూ.28వేల నగదు, 1సెల్ ఫోన్‌ను అపహరించుకొని పోయినట్లు ఎస్సై పురుషోత్తం బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటున్న బి.బాలస్వామి తన ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి ప్యాంట్ జేబులో ఉన్న రూ.28వేల నగదును, ఒక సెల్‌ఫోన్‌ను అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

రైతుల భూములను బలవంతంగా లాక్కోవద్దు

కొల్లాపూర్ రూరల్: ప్రాజెక్టుల పేరుతో రైతుల నుంచి బలవంతంగా పంట పొలాలను లాక్కోవద్దని సీపీఎం మండల కార్యదర్శి డి.ఈశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. కొల్లాపూర్ మండలంలోనే రైతులు ఎక్కువగా నష్ట పోతున్నారని, ప్రభుత్వం ఆలోచన చేసిరైతులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. రైతులకు న్యాయం చేయకపోతే ప్రభుత్వంపై ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతాం అని ఆయన హెచ్చరించారు.

సినిమా సమాచారం

వెంకటేశ్వర: జయ జానకి నాయక
సత్యసాయి : లై

'పెద్దకొత్తపల్లిలో కళాశాల ఏర్పాటు చేయాలి'

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దకొత్తపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులు చెల్లించలేక ఆర్థిక స్తోమత లేని కారణంగా కొంతమంది పేద విద్యార్థులు చదవులు మధ్యలోనే ఆపి వేస్తున్నారని పేర్కొన్నారు. పేదవిద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

చిన్నారులకు రుబెల్లా టీకాలు వేయించాలి



పెంట్లవెల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలు

పెంట్లవెల్లి: గురువారం నుంచి ఈ నెల 24వరకు చేపట్టనున్న కార్యక్రమంలో రుబెల్లా టీకాలు వేయించుకోవాలని వైద్యాధికారి మంగమ్మ ప్రజలకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో రుబెల్లా వ్యాధిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 సంవత్సరాలు వరకు ఉన్న పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ తప్పని సరిగా ఇవ్వాలన్నారు. ఈ వ్యాక్సిన్ ప్రతి అంగన్ వాడి కేంద్రంలో, ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. తల్లిదం డ్రులు తమ పిల్లలకు తప్పక వేయించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సరళ, పార్వతమ్మ, ఆశ కార్యకర్తలు నిర్మల, సువర్ణ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పేట్ల పంపిణీ



పేట్లను పంపిణీ చేస్తున్న సంఘనమౌని శివ

పెంట్లవెల్లి: మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామంలో 90 మంది విద్యార్థులకు 7వేల రూపాయల విలువచేసే ప్లేట్లను అదే గ్రామానికి చెందిన సంఘనమౌని శివ బుధవారం ప్రభుత్వ పాఠశాలలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉపాధ్యాయులు బోధించే విషయాలను శ్రద్ధగా విని నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉశేన్, ప్రధానోపాధ్యాయుడు రాజేష్, గ్రామస్థులు డబ్బా రాములు, పాఠశాల కమిటీ చైర్మన్ ధనుంజయ్, మల్లయ్య పాల్గొన్నారు.

చౌట చెరువు కట్ట విస్తరణకు చర్యలు



చెరువుకట్టను పరిశీలిస్తున్న ఏఈ, సర్పంచ్

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో చౌట చెరువు కట్టను బుధవారం ఆర్ అండ్ బీ ఏఈ యోహాన్, సర్పంచ్ కోట్ల సురేందర్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువుకట్ట విస్తీర్ణం లేనందున ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. వీటిపై మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చెరువుకట్ట మీద డబుల్ రోడ్డు నిర్మించేందుకు నిధులు కేటాయించారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ భాస్కర్, మల్లెలకృష్ణయ్య, వేణుగోపాల్, మహ్మద్‌పాష పాల్గొన్నారు.

నల్లబెల్లం పట్టివేత

పెంట్లవెల్లి : రాయలసీమ నుంచి అక్రమంగా తరలిస్తున్న 80కేజీల నల్లబెల్లాన్ని స్థానిక ఎస్సై సైదయ్య బుధవారం పట్టుకున్నారు. నర్సింగరావుపల్లికి చెందిన జల్లి కృష్ణయ్య రాయలసీమ ప్రాంతం నుంచి మంచాలకట్ట మీదుగా అతడి స్వగ్రామమైన నర్సింగరావుపల్లికి నల్లబెల్లాన్ని తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో స్థానిక ఎస్సై సైదయ్య పక్కా సమాచారంతో పట్టుకొని ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు.

గిరిజనుల గొంతెండుతోంది

- గేమ్యానాయక్‌తండాలో దాహం..దాహం
- మురుగు నీరందిస్తున్నారంటూ ఆవేదన
- రోగాలతో ఇబ్బందులు పడుతున్న గిరిపుత్రులు
- రక్షిత నీరందించాలని వేడుకోలు



నీటి కోసం నల్లావద్ద గిరిజనుల ఆరాటం

గేమ్యానాయక్ తండా(కొల్లాపూర్ రూరల్): వానాకాలంలో తాగునీటికి కటకట లాడుతున్నారు ముక్కిడిగుండం పంచాయతీ పరిధిలోని గేమ్యానాయక్ తండా వాసులు. తండా చుట్టూ కృష్ణానది ఉన్నా.. కూతవేటు దూరంలో వాటర్‌గ్రిడ్ పథకం ఏర్పాటు చేసినా గిరిపుత్రుల దప్పిక తీరడంలేదు. ఎండాకాలం కాకున్నా ఎన్నో రోజుల నుంచి తమకు మంచినీటి కష్టాలు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుక్కెడునీటికోసం ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విసిగివేసా రిన గిరిజనులు ఆందోళనలకు పూనుకోవడంతో ప్రజాప్రతినిధులు బావుల నుంచి ట్యాంకర్ల ద్వారా తాగునీరం దిస్తున్నారు. అయితే ట్యాంకర్ల నీళ్ల నుంచి దుర్వాసన వస్తోందని తండావాసులు ఆరోపిస్తున్నారు. వర్షాలు పడటంతో బావుల్లో ఉన్న నీరు పాచి పట్టిందని అలాంటి నీళ్లను తెచ్చి తాగమంటున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా పోషిన నీళ్ళు తాగి కొందరు గిరిజనులు మంచం పట్టారన్నారు. తండాలో చాలా మందికి నీళ్ల విరేచనలతో పాటు టైఫాయిడ్, విష జ్వరాలు సోకుతున్నాయని గిరిజనులు వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా లాభం లేదన్నారు. ఇప్పటికైనా తమ మొర ఆలకించాలని గేమ్యానాయక్ తండా వాసులతోపాటు గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

తండాకు మంచి నీరు సరఫరా చేయాలి

గేమ్యానాయక్ తాండ (కొల్లాపూర్ రూరల్): మండల పరిధిలోని గేమ్యానాయక్ తండాకు తాగు నీటిని సరఫరా చేయాల ని తండావాసులు, గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మల్లేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. గత కొన్ని రోజుల నుం చి తండాకు తాగునీరు రాకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ట్యాంకర్ల ద్వారా వస్తున్న నీళ్లు కూడా సరిగా లేవన్నారు. ఆ నీటిని తాగి గిరిజను లు రోగాల బారిన పడుతున్నారని వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని లేకపోతే ఆందోళలకు దిగుతాం అని వారు హెచ్చరించారు. కార్యక్రమం లో గిరిజన సంఘ మండల కార్యదర్శి అశోక్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శివవర్మ, భాస్కర్, తారసింగ్, రైతు సంఘం మండల కార్యదర్శి బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

వివక్ష వీడాలి



గేమ్యానాయక్ తండా గిరిజనులపై వివక్షను వీడాలి. తండావాసులకు రక్షిత మంచినీరందించకపోతే ఆందోళనలు చేస్తాం.

-అశోక్, గిరిజన సంఘం మండల కార్యదర్శి

రక్షిత మంచి నీరందించాలి



ట్యాంకర్ల ద్వారా నీళ్ళు పోస్తున్నారు కానీ ఆ నీళ్ళు తాగడంతో గిరిజనులకు రోగాలు వస్తున్నాయి. వెంటనే రక్షిత మంచి నీరు అందించాలి.

- తారసింగ్

చాలా రోజులుగా కష్టాలు



చాలారోజుల నుంచి తాగు నీరు రావడం లేదు. మంచి నీరందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి. లేకపోతే ఆందోళనలు చేస్తాం.

- భాస్కర్

'ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలి'

కొల్లాపూర్ రూరల్: ఎస్సీ వర్గీకరణను పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పుట్ట పాగ రాము బుధవారం ఒక ప్రకటనలో పేర్కోన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారానే ఎస్సీలకు సమన్యాయం జరుగుతోందన్నారు. ఎస్సీ వర్గీకరణ ములంగా అభివృద్ధి ఫలాలలు ఎస్సీలకు సమానంగా అందుతాయి అన్నారు. పార్టీలు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అందుకు అనుగుణంగా పార్లమెంట్‌లో ఎస్సీ బిల్లును ప్రవేశపెట్టాలని వారు డిమాండ్ చేశారు.

రోడ్డు నిర్మించాలి

కుడికిళ్ల(కొల్లాపూర్ రూరల్): కుడికిళ్ల, తీర్నాంపల్లి మధ్య రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాలకు చెందిన కొండల్, శ్రీనివాసులు, కాశీంలు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రోడ్డు లేక పోవడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. తీర్నాంపల్లి నుండి కిడికిళ్లకు చదువుకునేందుకు విద్యార్థులు కాలినడకన రావాల్సి వస్తోందన్నారు. కొల్లాపూర్‌కు కల్వకోల్ మీదుగా రావాలని, దీంతో వ్యయ ప్రయాసలు తప్పడం లేదని పేర్కొన్నారు. వెంటనే కుడికిళ్ల, తీర్నాంపల్లి గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం చేపట్టాలని వారు అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరారు.

వైభవంగా గోపాలకృష్ణ కల్యాణం

కొల్లాపూర్: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని కొల్లాపూర్‌లో బుధవారం కృష్ణుని వీధిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో మురళీ గోపాలుడి కల్యాణం నిర్వహించారు. ఈ ఉత్సవానికి మహిళలు, చిన్నారులు పెద్దఎత్తున హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఏటా ఈ వీధిలో గోపాలకృష్ణ కళ్యాణోత్సవంను ఘనంగా నిర్వహిస్తామని బరిగెల వేణుగోపాల్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు గాలి యాదవ్, జడ్పీటీసీ మాజీ మెంబర్ రాణి గాలియాదవ్, యాదవ సంఘం నాయకులు బరిగెల సత్యనారాయణ యాదవ్, బిచ్చయ్య యాదవ్, గోపన్న, బత్తుల మల్లయ్య, లింగస్వామి, బస్వలింగం, గనమౌని పరుశరాములు, కొండల్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో కృష్ణుని వీధిలో గోపాల కృష్ణుని కల్యాణోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కొల్లాపూర్ సమాచారం

తహసీల్దార్	:9000101488
వ్యవసాయాధికారి:	7288894354
ఎంపీడీఓ:	8008377455
ట్రాన్స్‌కో ఏఈ:	9440813494
పంచాయతీ కమిషనర్	9951524815
సీఐ:	9440795725
ఎస్ఐ:	9440795711

గ్యాస్ సమాచారం

భారత్ గ్యాస్: 08501- 275384

మార్కెట్ ధరలు

వేరుశెనగ	: 5000
కందులు	: 5050
వరి(1010రకం)	: 1450
మొక్కజొన్న	: 1410

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

హరితహారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- జడ్పీటీసీ సభ్యుడు వెంకటయ్య



పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న హరితహారం పథకంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జడ్పీటీసీ సింగారం వెంకటయ్య బుధవారం ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

మండలంలో 3వ విడత హరితహారంలో ఎన్ని మొక్కలు నాటనున్నారు?

మండలంలో 6లక్షల 80వేల మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ఇప్పటి వరకు 2లక్షల 80వేల మొక్కలు నాటాం. ప్రతి పంచాయతీలో 40వేల మొక్కలు నాటాలి. వర్షాలు అనుకూలించక పోవడం, మొక్కల్లేనందున నాటడంలో కొంత జాప్యం జరుగుతోంది. మొక్కలు వచ్చిన వెంటనే నాటి లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా..?

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అన్ని వర్గాల వారికి అందేవిధంగా కృషి చేస్తున్నాం. గ్రామాల్లో ఎవరైనా అర్హులుంటే మా దృష్టికి తీసుకొని వస్తే వారికి న్యాయం జరిగేలా చూస్తాం.

ప్రభుత్వ కార్యాలయాల సొంత భవనాలకు నిధులు మంజూరయ్యాయా..?

మండల కేంద్రంలో సొంత భవనాల్లేని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేస్తాం.

మినీస్టేడియం కోసం కృషి చేశారా?

మండల కేంద్రనంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని గతంలో రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. అప్పట్లో మంత్రి స్టేడియం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి సహకారంతో మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తున్నాను.



ఎక్కిన 'గట్టు'

- ఎత్తిపోతలకు త్వరలో మోక్షం
- ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్
- డిజైన్ లో మార్పులు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

ఆంధ్రజ్యోతి, గద్వాల : నడ్డిగడ్డ ప్రాంత రైతాంగానికి తీపి కబురు అందనుంది. గట్టు ఎత్తిపోతల పథకానికి మోక్షం లభించనుంది. దశాబ్దకాలంగా ఎదురు చూస్తున్న రైతాంగానికి రెండేళ్లలో సాగునీరు అందే అవకాశం లభించనుంది. గట్టు, కేటీదొడ్డి, ధరూర్ మండలాల్లోని భూములకు సాగునీటి లభ్యత, అదనపు భూములు సాగులోకి రానున్నాయి. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) ఇంజనీర్ల బృందం గట్టు ఎత్తిపోతల పథకానికి తుదిరూపం ఇచ్చారు. ఈమేరకు గట్టు ఎత్తిపోతలపై పదిరోజుల్లో ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వనున్నారు. డిజైన్ మార్పుతో ఎత్తిపోతల పథక వ్యయం తగ్గడంతో పాటు సాగు పెరగడానికి అవకాశాలు అధికంగా ఉన్నాయి.

తగ్గనున్న అంచనా వ్యయం..

గట్టు ఎత్తిపోతల పథకం ఇప్పటికే మూడు సార్లు డిజైన్ల మార్పు పేరుతో కాలయాపన చేశారు. నాలుగో సారి చివరగా సెంట్రల్ డిజైన్ రిటైర్డ్ ప్రత్యేక ఇంజనీరు వారం రోజులు క్రితం గట్టు ఎత్తిపోతల పథకం నిర్మాణం జరిపే స్థలాన్ని పరిశీలించారు. ఆయన సూచనల మేరకు డిజైన్‌లో మరిన్ని సవరణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఉన్న నీటినిల్వల సామర్థ్యాన్ని 1.60నుంచి 1.75 టీఎంసీలకు రిజర్వాయర్ కేపాసిటీని పెంచాలని సూచించారు. గట్టు మండలం పెంచికల్‌పాడు వద్ద నిర్మాణం తలపెట్టిన రిజర్వాయర్ వంకర్లు(కర్వ్) తగించాలని సూచించారు. గతంలో మోటార్లు, పంపులు, పైపులు వినియోగించకుండా రాజీవ్, ఇందిరా సాగర్ వద్ద మిగిలిన ఉన్న మోటార్లు, పైపులకు అనుగుణం గా డిజన్లు చేయాలనుకున్నారు. నీటిని ఎత్తిపోసే ప్రెజర్(ఒత్తిడి సామర్థ్యాన్ని) కూడ పంపులకు, మోటార్లకు అనుగుణంగా మార్చాలని సూచించారు. గతంలో కేటీదొడ్డి, గట్టు మండలాల పరిధిలో ఉన్న ఆరువేల ఎకరాల భూమిని సోలార్ ఉత్పత్తికి వినియోగించాలని భావించారు. ప్రస్తుతం వారు తీసుకోవడం లేదని తెలియడంతో ఆభూములు కూడా సాగులోకి తెచ్చేలా డిజైన్ మార్చాలని ఆదేశించారు. ఈ మార్పుతో గతంలో నిర్ధారించిన సాగు 28వేల నుంచి 33వేల ఎకరాల పెరిగే అవకాశం ఉంటుంది. ఈమేరకు డిజైన్‌లో మార్పులు చేసి ప్రభుత్వానికి పది రోజుల్లో నివేదికలు ఇవ్వనున్నారని ఇరిగేషన్ అధికారులు చెపుతున్నారు.

అదనపు జలాల తరలింపు

నెట్టెంపాడు నుంచి ప్రస్తుతం 20టీఎంసీల నీరు తీసుకునే అవకాశం ఉంది. గట్టు, కేటీదొడ్డి, ధరూర్ మండలాల నుంచి వర్షాల ద్వారా జూరాలకు చేరే నాలుగు టీఎంసీల నీటిని కూడా వాడే అవకాశం ఉంది. నాలుగు టీఎంసీలు కాకున్నా ప్రస్తుతం గట్టు ఎత్తిపోతల ద్వారా 2.80టీఎంసీల నీటిని తీసుకుంటే గట్టు ఎత్తి పోతలకి సాగునీరు సరిపోయే అవకాశం ఉంది. ఈమేరకు పెంచికల్‌పాడు వద్ద నిర్మాణం జరిపే 1.75 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నుంచి గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో ఉన్న 41చెరువులను నీటితో నింపడంతోపాటు రిజర్వాయర్‌లో 1.75టీఎంసీల నీరు నిల్వ ఉంచుకోవడానికి ప్రస్తుతం డిజైన్‌లో పొందుపరిచారు. నాలుగు టీఎంసీల సామర్థ్యం కలిగిన ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి గట్టు ఎత్తిపోతల పథకానికి నీటిని మళ్లిస్తారు. ర్యాలంపాడులో 1.50టీఎంసీల నీరు ఉన్న కూడ గట్టుకు నీటిని కాల్వల ద్వారా తీసుకెళ్లడానికి వీలు ఉండేలా ఎత్తిపోతలకి డిజైన్ మార్పులు చేస్తున్నారు.

దశాబ్దకాలంగా ఎదురు చూపులు

సముద్రమట్టానికి 400మీటర్ల ఎత్తుగా ఉండే ప్రాంతంగా గట్టు మండలం. ఈమండలానికి సాగునీరు అందించడం ఇరిగేషన్ శాఖ సవాల్‌గా పరిణమిస్తూ వస్తుంది. 2005లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గట్టు ఎత్తిపోతలకు అనుమతి ఇచ్చారు. హైలెవల్ కెనాల్ ద్వారా గట్టు మండలంలోని మూడు వేల ఎకరాలకు సాగునీరివ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఈక్రమంలో జరిగిన సర్వేల్లో భాగంగా హైలెవల్ కెనాల్ కంటే ఎత్తి పోతల పథకం నిర్మాణం చేపడితే 20 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చారు. ఈపథకం చేపట్టాలని అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఎమ్మెల్యే డీకే ఆరుణ ఒత్తిడి తీసుకు వచ్చారు. ఈమేరకు ప్రభుత్వం గట్టు ఎత్తిపోతల పథకానికి మంజూరు ఇచ్చింది. అనంతరం ఎన్నికల్లో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. గట్టు ఎత్తి పోతల పథకాన్ని నిర్మాణం జరుపుతామని అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించారు. నాటి నుంచి నేటి వరకు సర్వేలు, డిజైన్ల మార్పులతో కాలయాపన జరుగుతూ వస్తోంది. చివరకు 28 వేల ఎకరాలకు సాగు నీరు అందించడానికి గట్టు ఎత్తిపోతలకి రూపకల్పన చేశారు. రూ. 406కోట్ల నిధులు ఖర్చుఅవుతాయని అంచనా వేశారు. కానీ ఈ నివేదికను సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ మరో మారు పరిశీలించాలని భావించడంతో వారం రోజుల కింద పరిశీలించి పలు మార్పులు చేశారు.

పెరగనున్న సాగు

గట్టు ఎత్తిపోతల పథకంలో కొత్త డిజైన్ల మార్పుతో నిర్మాణం జరిగితే వ్యయం తగ్గడంతోపాటు, సాగు విస్తీర్ణం పెరుగునుంది. గతంలో రూ.406కోట్ల ఖర్చు అవుతుందని అంచనాలు వేశారు. కాని కట్టమలుపు(కర్వ్) తగ్గించడం, రాజీవ్, ఇందిరా సాగర్‌కు సంబంధించిన పంపులను, మోటార్లను, పైపులను వినియోగించుకోవడంతో సాగు వ్యయం రూ.100కోట్ల మేర తగ్గే అవకాశంఉందని అధికారులు భావిస్తున్నారు. గతంలో ఉన్న 28వేల ఎకరాలకు సోలార్ విద్యుత్తుకు కేటాయింపులు చేస్తారనుకున్న ఐదు వేల నుంచి ఆరు వేల ఎకరాల భూములను కూడ సాగులోకి తీసుక రావడానికి ఎత్తి పోతల నీరు అందించాలని నిర్ణయం తీసుకోవడంతో 33 వేల ఎకరాల నుంచి 35 వేల ఎకరాల సాగు పెరిగే అవకాశం ఉంది. తుంగభద్ర నదిలో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం, గట్టు ఎత్తిపోతల పథకం పూర్తివుతే.. కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ఉన్న నడిగడ్డ సస్యశ్యామలం కానుంది.



మంత్రి లక్ష్మారెడ్డిచేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న హెచ్ ఎం భూపాల్‌రెడ్డి

అద్దె భవనమైనా
ఫలితాలు అదుర్స్

జిల్లా ఉత్తమ స్వచ్ఛ విద్యాలయ పురస్కారాన్ని అందుకున్న పేట ప్రభుత్వ అభ్యాసన ఉన్నత పాఠశాల

నారాయణపేట: అద్దె భవనంతో అవస్థలను ఎదుర్కొంటూ ఉపాధ్యాయుల సమష్టి కృషితో విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ పాఠశాల పనితీరు అదుర్స్ అని చెప్పవచ్చు. 2016- 17 విద్యా సంవత్సరానికి గాను జిల్లా వ్యాప్తంగా పది పాఠశాలలు స్వచ్ఛ విద్యాలయ పురస్కారంకు ఎంపిక కాగా అందులో రెండు ఉన్నత పాఠశాలల్లో ఒకటి నారాయణ పేట ప్రభుత్వ అభ్యాసన ఉన్నత పాఠ శాలకు ఈ పురస్కారం లభించడం విశేషం. స్వతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో మంత్రి లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ రొనాల్డ్ రోస్, డీఈఓ సోమిరెడ్డిల చేతుల మీదుగా ఉత్తమ పురస్కారాన్ని హెచ్ ఎం భూపాల్‌రెడ్డి అందుకున్నారు. 1947లో ప్రాథ మిక పాఠశాలగా, 67లో ప్రాథమికోన్నత పాఠ శాలగా, 2002లో ఉన్నత పాఠశాలగా దశాబ్దాల చరిత్రగల ప్రభుత్వ అభ్యాసన ఉన్నత పాఠశాల ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతూ మూడు ముక్కలై సమస్యల సుడి గుండంలో సతమత మౌతున్నా, వీటన్నింటిని అదిగమించి ప్రధానోపాధ్యాయుడు భూపాల్‌రెడ్డి, తోటి ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకొని చక్కటి విద్యా బోధనతో పాటు పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలు సుచి శుభ్రతగా ఉంచేలా చూస్తున్నారు. 6నుంచి పదో తరగతి వరకు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో 374 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా ప్రవేటు పాఠశాలలకు ధీటుగా విద్యాభ్యాసం కొనసాగడం అనునిత్యం తాగేందుకు మినరల్ వాటర్, విద్యార్థులకు వ్యక్తిగత పారిశుధ్యంపై ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు చైతన్య పరుస్తున్నారు. భోజనాలు చేసే ముందు విద్యార్థులు తమ చేతులను శుభ్రంగా కడుక్కోవడం, తరగతి గదులను శుభ్రంగా ఉంచుకోవడం వంటి స్వచ్ఛతకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా ఈ పాఠశాల కొనసాగుతుంది.

పాఠశాల పనితీరు బేష్..

ఇక్కడి ప్రాథమిక పాఠశాల శిథిలావస్తకు చేరడంతో గత ఏడాది ఈ పాఠశాలను ఎమ్మెల్యే ఎస్ఆర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రొనాల్డ్ రోస్‌లు సందర్శించి ప్రత్యామ్నాయంగా ఈ పాఠశాలను ఖాళీ చేయించి ప్రాథమిక పాఠశాల ఒకటి నుంచి ఐదు తరగతులను జంగిడి గడ్డ ప్రభుత్వ పాఠశాలకు తరలించారు. కాగా ఉన్నత పాఠశాల ఆరునుంచి పదో తరగతి వరకు అద్దె భవనంలో కొనసాగుతుంది. ఇంగ్లీష్ మీడియం తరగతులు లాల్ మస్జీద్ ఉర్దూ మీడియం పాఠశాలలో కొనసాగుతున్నాయి. 15 మంది ఉపాధ్యాయులు ఉండగా తెలుగు 1 సాంఘీక 2 పోస్టులు ఖాళీ ఉన్నాయి. గత ఏడాది పది పరీక్షల్లో ఈ పాఠశాలకు సంబంధించి తెలుగు మీడియంలో 52 మందికి గాను 45మంది ఉత్తీర్ణులు కాగా వర్షా, చిన్న సాయమ్మలు 9.2 గ్రేడింగ్ సాధించారు. ఇంగ్లీష్ మీడియంలో 11 మంది పాసై వంద శాతం ఉత్తీర్ణతతో భువన చంద్ర 9.2 గ్రేడింగ్ సాధించడం విశేషం.



విద్యార్థులను పరిశీలిస్తున్న హెచ్ ఎం



అద్దె భవనంలో కొన సాగుతున్న అభ్యాసన ఉన్నత పాఠశాల

సొంత భవనం కేటాయించాలి..



ప్రభుత్వ అభ్యాసన ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాల ఒకే చోట కొనసాగేలా చూసిసొంత భవనం కెటాయించాలి. పరిశుభ్రతకు నిలయంగా ఉన్న పాఠశాలకు స్వచ్ఛ విద్యా లయ పురస్కారం రావడం ఆనందదాయకం.

– శివకుమార్, ఎస్ఎంసీ చైర్మన్ ప్రభుత్వ అభ్యాసన ఉన్నత పాఠశాల

సంతోషాన్ని నింపింది..



జిల్లా స్థాయిలో స్వచ్ఛ విద్యాలయ్ పురస్కారం అవార్డును అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. సమస్యలు ఉన్నా ఉన్నదాంట్లోనే ఉపాధ్యాయుల సమిష్టికృషి, విద్యార్థుల చొరవ, అందరి సహకారంతో పాఠశాలను సుచి శుభ్రతతో చక్కటి బోధన అందిస్తు ముందుకు సాగుతున్నాం.

– భూపాల్ రెడ్డి, హెచ్ఎం, ప్రభుత్వ అభ్యాసన ఉన్నత పాఠశాల

ప్రసవాల్లో
వనపర్తి టాప్..!



(ఆంధ్రజ్యోతి, వనపర్తి): జిల్లాల పునర్విభజన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం వైద్యారోగ్యశాఖ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. రోగులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు మాతాశిశు మరణాలను తగ్గించి, పేదవాడికి వైద్యసేవలు అందుబాటులోకి వచ్చేలా చేయాలని సంకల్పించింది. ఇందులో భాగంగా ఆస్పత్రుల్లో అన్ని వసతులు కల్పించడంతో పాటు కేసీఆర్ కిట్‌ను అందుబాటులోకి తేవడంతో జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగింది. జిల్లా కలెక్టర్ శ్వేతామహంతి ప్రత్యేకదృష్టి సారించడంతో ఈ ఫలితాలు మరింత మెరుగయ్యాయి. అందులో భాగంగానే ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు జానాభా నిష్పత్తిని బట్టి అత్యధికశాతం ప్రసవాలు రాష్ట్రంలోని వనపర్తి జిల్లాలోనే జరగడం హర్షణీయం. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు జిల్లా పరిధిలో 1568 ప్రసవాలు ప్రభుత్వాస్పత్రుల్లోనే జరిగాయి. అందులో అత్యధిక వాటా 976 సాధారణ ప్రసవాలు.. 592 శస్త్రచికిత్సల ద్వారా ప్రసవాలు నిర్వహించారు. వైద్యారోగ్యశాఖ సిబ్బంది కృతనిశ్చయంతో శ్రమిస్తుండటంతో రాష్ట్రంలోనే జిల్లా అగ్రస్థానంలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఏ ఆస్పత్రిలో ఎన్ని ప్రసవాలు..

వనపర్తి జిల్లాలో మొత్తం 14 మండలాల్లో 15 ఆస్పత్రులు ఉన్నాయి. జిల్లాకేంద్రంలోని వంద పడకల ఆస్పత్రిలో అత్యధికంగా 372 సాధారణ ప్రసవాలు, 546 ఆపరేషన్లు చేశారు. తర్వాతి స్థానంలో ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రిలో 75 సాధారణ ప్రవసాలు.. 39 సిజేరియన్లు జరిగాయి. జిల్లాలో ఆత్మకూరు, వనపర్తి, రేవల్లి ఆస్పత్రిల్లో మాత్రమే ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. మిగతా ఆస్పత్రుల్లో కేవలం సాధారణ ప్రసవాలు మాత్రమే నిర్వహిస్తున్నారు. జిల్లా ఏర్పాటుకు ముందు ఈ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. ఫలితంగా పేద ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ఇబ్బందులు పడేవారు. అయితే ప్రస్తుతం జిల్లా అధికారగణంతో నిరంతర పర్యవేక్షణ పెరిగి, ప్రభుత్వాస్పత్రుల్లో సేవలు బాగా అందుతుండటంతో పేద, మధ్య, ధనిక వర్గానికి చెందిన ప్రజలు కూడా ప్రభుత్వ వైద్యశాలలకే వెళుతున్నారు.

కేసీఆర్ కిట్ తర్వాత మరింత ఎక్కువగా..

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేసీఆర్ కిట్, అమ్మ ఒడి పథకాలను ప్రారంభించింది. దీనివల్ల ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకునే వారికి రూ.12వేల పారితోషకం ఇస్తారు. అలాగే 16 వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్‌ను బహూకరిస్తున్నారు. ఒకవేళ సాధారణ ప్రసవంలో ఆడపిల్ల పుట్టినట్లయితే అదనంగా మరో వెయ్యి కలిపి రూ. 13వేలు అందజేస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వేలాది రూపాయాలు ఖర్చు ఎందుకు చేసుకోవాలని ప్రభుత్వాస్పత్రులకు ఎక్కువమంది క్యూ కడుతున్నారు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగుల సతీమణులకు ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసూతి చేయిస్తున్నారంటే పరిస్థితో ఎంత మార్పు వచ్చిందో అర్థం చేసుకోవచ్చు.


ఈ కేసీఆర్ కిట్ పథకం లబ్ధిదారులు వివరాలు..

జూన్ 2 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 811 మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. ఇందులో ప్రభుత్వ పారితోషం 730 మందికి మాత్రమే ఇచ్చారు. ప్రసవాల కంటే పారితోషక లబ్ధిదారులు తక్కువ ఉండటానికి కారణం ప్రభుత్వం ఒకటి, రెండో కాన్పుల వరకే ఈ పథకాన్ని వర్తింపజేయడమే..

సౌకర్యాలు, సిబ్బంది కల్పిస్తే మేలు..

జిల్లాల విభజన తర్వాత వనపర్తి జిల్లాకేంద్రంలోని వంద పడకల ఏరియా ఆస్పత్రిని 250 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ జిల్లా ఆస్పత్రిగా మార్చారు. అయితే అందుకు తగ్గట్లుగా సిబ్బంది స్థాయిని, సౌకర్యాలను పెంచలేదు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే విధానపరమైన నిర్ణయం కావడంతో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు ఉన్నంత సర్దుకుని మంచి ఫలితాలను సాధిస్తున్నాయి. అయితే ప్రక్షాళనపై దృష్టిపెట్టిన ప్రభుత్వం సౌకర్యాలు, సిబ్బంది కల్పనపై కూడా దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

ప్రసవాల్లో మనమే టాప్



రాష్ట్రంలో జనాభా నిష్పత్తి ప్రకారం తీసుకుంటే వనపర్తి జిల్లాలో ప్రసవాల సంఖ్య ఎక్కువగా ఉంది. జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడం వల్ల సిబ్బంది సరిపోని మాట వాస్తవమే. రాష్ట్ర ప్రభుత్వమే విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. అలాగే బాలింత తరపు బంధువులు పోస్ట్ ఆపరేటివ్ వార్డులోకి చెప్పులు వేసుకోని రాకూడదు. అలా రావడం వల్ల ఇన్‌ఫెక్షన్ సోకుతోంది. సెక్యూరిటీలను నియమించాలని భావిస్తున్నప్పటికీ కోర్టులో కేసు ఉన్నందున ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు.

– డీఎంహెచ్ఓ శ్రీనివాసులు

- సుధీర్ఘ నిరీక్షణకు తెర
- రేపు విడుదల కానున్న 'ప్రతిక్షణం' సినిమా
- అన్ని పాటలు రాసిన నల్లమల ప్రాంతానికి చెందిన అలరాజు
- ఇప్పటివరకు వంద రకాల పాటలు రచన

చిరకాల ప్రతిక్షణం



ప్రతిక్షణం సినిమా ఆడియో వేడుకలో ప్రముఖులు

పదర: కలలుకనండి వాటిని సాకారం చేసుకోండి అన్నాడు దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం. వాటిని బాగా వంటపట్టించుకున్నాడు నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట డివిజన్‌లోని పదర మండల కేంద్రానికి చెందిన అలరాజు. ఇంటర్ చదువుతున్నపుడు గేయ సాహిత్యంపై ఆసక్తి పెంచుకున్నాడు. ఆ ఆసక్తితోనే డిగ్రీలో స్వయంగా పాటలను రాసి కళాశాలలోని వివిధ కార్యక్రమాల్లో పాడి వినిపించేవాడు. అప్పుడు అందరూ మెచ్చుకోక విమర్శించినా డీలా పడలేదు. విమర్శనే కసిగా తీసుకున్నాడు. ఆరేళ్ల పాటు దీక్షతో శ్రమించి పాటలు రాసేవాడు. అందులో భాగమే నల్లమల నేపథ్యంలో సాగిన "ప్రతిక్షణం" సినిమాకు పాటలు రాసి తన కలను సాకారం చేసుకున్నాడు. ఇటీవలే ఈ సినిమా ఆడియో త్రిపుల్ ప్లాటినం డిస్క్ వేడుకను కూడా జరుపుకుని అందరిని మన్ననలు పొందింది. ఈ నెల 18న ఈ చిత్రం విడుదల కానుంది.

కుటుంబ నేపథ్యం..

ఈయన తల్లిదండ్రులు పోకల కారి గోరోజి, సుగుణమ్మలు నిరుపేద కుటుంబం. వారికి ఈయన రెండో సంతానం. ప్రాథమిక విద్యను గ్రామంలోనే పది వరకు విద్యను కొనసాగించాడు. ఇంటర్ అమ్రాబాద్, డిగ్రీ కొండనాగులలోని ఉమామహేశ్వర డిగ్రీ కళాశాలలో చదివాడు. అనంతరం హైదరాబాద్‌లో డిగ్రీ చదివాడు. అంతటితో ఆగకుండా ఎం.కాం పూర్తి చేశాడు.

రచనకు శ్రీకారం..

గత ఎన్నికల ముందు "మీ తలరాతలను మార్చు.. నేతల రాతను మార్చు.. నీ ఓటే చీకటిని వెలుగుగా మార్చు...." అంటూ రాసిన గీతం రాశాడు.

స్వచ్ఛభారత్ ప్రచారం కోసం

"పదరా ముందుకు నిజంగా.... మనకే మేలిదికదా.... చెడును చెత్తను క్రమంగా......తొలగించే సదా...." వంటి గీతాలు రాశాడు. ఈ గేయాలను ప్రభుత్వం గుర్తించి ప్రశంసించింది.

లక్ష్యం..

సినిమాలకు పాటల సహిత్యాన్ని అందిస్తూ ప్రతి శ్రోత మన్ననలు పొంది వారి మనుసులో సుస్థిర స్థానం సంపాదించుకోవడం ఈయన లక్ష్యం. ఇంకా మరిన్ని మంచి సినిమాలకు పాటలు రాస్తూ నల్లమల కీర్తిని ఇనుమడింప జేసేందుకు ఆయన ముందుకు వెళుతున్నాడు.

ఎదుగుదలకు అండగా ఉంటా..

– ఎమ్మెల్యే గువ్వల బాలరాజు : నల్లమలకు చెందిన యువకుడు అలరాజు సినీగేయ రచయితగా మారడం హర్షణీయం. అన్ని వేళలా ఆయన ఎదుగుదలకు అండగా ఉంటా. ఆయన అనుకున్న లక్ష్యాలను చేరుకుని అందరి హృదయాల్లో మంచి స్థానం సంపాదించి నల్లమలకు మంచి పేరుతేవాలని ఆకాంక్షిస్తున్నా.

నావేదన ప్రతిక్షణం తీర్చింది..

– అలరాజు : పురటినొప్పుల బాధ అనుభవించిన తల్లిలా నా అనుభవం ఇప్పుడే జన్మనిచ్చిన బిడ్డలా "ప్రతిక్షణం" తీర్చింది. నా చిరకాల స్వప్నం గేయ రచన. దానికోసం నేను పడిన వేధన బాధ, కష్టాలు అన్నీఇన్నీ కావు. ఆరేళ్ల నా మౌన పోరాటం నా కలం ద్వారా ఈ సమాజంతో మాట్లాడాను. అందులో కొన్ని "ప్రతిక్షణం" సినిమా పాటలతో చూపాను. సినిగేయ రచయితగా మీ ముందుకు రావడం ఆనందంగా ఉంది. నా తల్లిదండ్రులు, మా ఊరు, ఈ ప్రాంతం, నా స్నేహితులు నాకందించిన తోడ్పాటుకు ఆజన్మాంతం రుణపడి ఉంటా.

ఓడీఎఫ్‌లో
పాలమూరు ఓకే..

- వెనుకంజలో బాదేపల్లి, పేట మున్సిపాలిటీలు
- పాలమూరులో 8221 మరుగుదొడ్ల నిర్మాణాలు
- నారాయణపేటలో 1394, జడ్చర్లలో 1027
- ముగిసిన 100 శాతం నిర్మాణాల లక్ష్యం
- పేట, బాదేపల్లి వెనుకబడటంతో అకౌంట్లు ఫ్రీజ్

మహబూబ్‌నగర్ : మున్సిపాలిటీలలో 100 శాతం మరుగుదొడ్ల నిర్మాణాలే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛభారత్ కార్యక్రమం ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్ని విధంగా మారింది. జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో స్పెషల్‌గ్రేడ్ మున్సిపాలిటీ అయిన పాలమూరులో 100 శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తవగా, నారాయణపేట, బాదేపల్లి మున్సిపాలిటీలో లక్ష్యాన్ని చేరుకోవడంలో వెనుకబడ్డాయి. అనుకున్న సమయానికి 100 శాతం మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఆ మున్సిపాలిటీల అకౌంట్లను ఫ్రీజ్ చేశారు. ఆగష్టు 15నాటికి రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో 100 శాతం ఓడీఎఫ్ (బహిరంగ మల విసర్జన రహితం) చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీలలో అధికారులు రెండు నెలల పాటు ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణం ఉండేలా ఎంపిక చేశారు. మరుగుదొడ్లులేని వాటితో పాటు, సెప్టిక్ ట్యాంక్‌లు లేకుండా నేరుగా మురుగుకాలువల్లోకి వదలడం వంటి వాటిని గుర్తించి, లబ్ధిదారుల జాబితాను తయారు చేశారు.

నెలరోజులుగ వేగవంతం

అయితే మొదట్లో మందకొడిగా సాగినా నెలరోజుల క్రితం పురపాలిక శాఖ మంత్రి కేటీఆర్ ఆగష్టు 15 నాటికి అన్ని మున్సిపాలిటీలను 100 శాతం ఓడీఎఫ్‌లుగా ప్రకటించాలని, లేని పక్షంలో సంబంధిత మున్సిపాలిటీల అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీచేశారు. దీంతో నెలరోజుల నుంచి నిర్మాణాలు ఊపందుకున్నాయి. అధికారులు, సిబ్బంది ఇల్లిల్లు తిరిగి లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణాలు చేపట్టేలా కృషిచేస్తున్నారు. పాలమూరు మున్సిపాలిటీలో రాష్ట్రంలోనే వరంగల్ తరువాత ఎక్కువ నిర్మాణాలు చేపట్టారు. మున్సిపాలిటీలో 8221 మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టారు. వీటికోసం ఇప్పటికే రూ.8.7 కోట్లు ఖర్చుచేశారు. రెండ్రోజుల క్రితమే పాలమూరులో 100 శాతం నిర్మాణాలు పూర్తిచేసి ఓడీఎఫ్‌గా ప్రకటించుకున్నారు. నారాయణపేట మున్సిపాలిటీలో 1394 నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటివరకు 1150 నిర్మాణాలు పూర్తిచేశారు. మరో 244 ప్రగతిలో ఉండగా, వీటికి మొదటి విడత బిల్లులు కూడా చెల్లించారు. బాదేపల్లిలో 1027 మరుగుదొడ్ల నిర్మాణాలకు గాను 706 నిర్మాణాలు పూర్తవగా, 321 మరుగుదొడ్లు నిర్మాణంలో ఉన్నాయి.

అకౌంట్లు ఫ్రీజ్

